ఈనాడు
పశ్చిమగోదావరి
గురువారం అక్టోబరు 17, 2024


వామనావతారంలో స్వామివారు

గుణగణాలు కీర్తించి.. పరిణయానికి ఒప్పించి!

నేత్ర పర్వంగా ఎదుర్కోలు ఉత్సవం..

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవారి ఆశ్వయుజ మాస తిరుకల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం ఎదుర్కోలు ఉత్సవం నేత్ర పర్వంగా నిర్వహించారు. తొలుత ఆలయ ఆవరణలో అర్చకులు శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడిని వెండి శేష వాహనంపై కొలువుదీర్చి ప్రత్యేకంగా అలంకరించి.. పూజలు నిర్వహించారు. అనంతరం పండితులు, అర్చకులు రెండు వర్గాలుగా ఏర్పడి.. ఒకరు స్వామివారి, మరొకరు అమ్మవార్ల గుణగణాలు కొనియాడి..పెళ్లికి ఒప్పించిన తీరు భక్తులకు కనువిందైంది. ప్రత్యేక అలంకారాల్లో భాగంగా స్వామివారు వామనావతారంలో దర్శనమిచ్చారు. హనుమద్వాహనాన్ని అధిరోహించి ద్వారకాతిరుమల పురవీధుల్లో శ్రీరాముని అలంకారంలో విహరించారు. ● బుధవారం రాత్రి స్వామి వారు వెండి శేష వాహనంపై విహరించారు. ● కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం ఏడు గంటలకు సింహ వాహనంపై శ్రీవారి గ్రామోత్సవం. రాత్రి 8 గంటలకు తిరుకల్యాణ మహోత్సవం. వెండి గరుడ వాహనంపై గ్రామోత్సవం ఉంటాయి.


ఎదుర్కోలు ఉత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న పండితులు

నీటి సంఘాల ఎన్నికల ప్రకటన వాయిదా

ఉండి, న్యూస్‌టుడే: నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల ప్రకటన వాయిదా వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పశ్చిమ డెల్టాలో ఒక ప్రాజెక్టు కమిటీ (పీసీ), 20 డిస్ట్రిబ్యూటరీ కమిటీ (డీసీ)లు, 131 నీటి సంఘాల ఎన్నికలకు బుధవారం నోటిఫికేషన్ విడుదల కావాల్సి ఉంది. గ్రామాల వారీగా పంటలు, సర్వే సంఖ్యల వివరాలను జలవనరుల శాఖ సిద్ధం చేసింది. వివిధ జిల్లాల్లో వర్షాలతో నెలకొన్న ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో ఈ ప్రక్రియ తాత్కాలికంగా వాయిదా పడి ఉండొచ్చని భావిస్తున్నారు. ప్రభుత్వం నుంచి తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఎన్నికల ప్రక్రియ వాయిదా పడినట్లేనని జలవనరుల శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ నాగార్జునరావు తెలిపారు.

రూ. కోట్ల పెట్టుబడి.. సేవలు మొక్కుబడి!

అక్కరకు రాని సమీకృత ప్రయోగశాలలు


➡ భీమవరంలో నిర్మించిన సమీకృత ప్రయోగశాల భవనం ఇది. దిగువ భాగాన్ని వ్యవసాయ శాఖకు, పైఅంతస్తును మత్స్యశాఖకు కేటాయించారు. ఆరునెలల కిందట ఇది ప్రారంభమైనా తగినంత సిబ్బంది లేరు. వర్షం కురిసినప్పుడు లోపలికి వెళ్లే మార్గం కూడా ఉండదు. వివిధ పరీక్షల నిమిత్తం అత్యాధునిక పరికరాలు ఉన్నా నీటి సౌకర్యం లేదు.


➡ భీమవరంలో మత్స్యశాఖ జిల్లా కార్యాలయంలో కొన్నేళ్ల కిందట ఏర్పాటు చేసిన ఆక్వా ప్రయోగశాల ఇది. ఇక్కడ పరిమితంగా నీరు, మట్టి పరీక్షలు మాత్రమే చేస్తుండటంతో రైతులు పెద్దగా రావడం లేదు. ముఖ్య పరీక్షల కోసం ప్రైవేటు కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోంది.

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: పశ్చిమ డెల్టాలో కీలకమైన చేపలు, రొయ్యల సాగు సజావుగా సాగాలంటే ప్రారంభ దశ నుంచి వివిధ పరీక్షలు అవసరం. వరి సాగులోనూ కొన్ని సందర్భాల్లో పరీక్షలు చేయాల్సి ఉంటుంది. ఈ సేవలు అందించేందుకు ప్రభుత్వం భీమవరం, నరసాపురం, పాలకొల్లు, మార్టేరులలో సమీకృత ప్రయోగశాలలను మంజూరు చేసింది. వీటి నిర్మాణాలకు రూ.కోటి చొప్పున వెచ్చించింది. పనులు నత్త నడకను తలపించి ఎట్టకేలకు పూర్తయ్యాయి. భీమవరం, నరసాపురంలో మాత్రం ఎన్నికలకు ముందు ఈ కేంద్రాలు ప్రారంభమైనా పూర్తిస్థాయి సేవలు అందడం లేదని రైతులు చెబుతున్నారు. మిగిలిన రెండు చోట్ల ప్రారంభం కాలేదు. అసలివి ఎప్పుడు అందుబాటులోకి వస్తాయో అర్థం కాని పరిస్థితి నెలకొంది.

ఇదీ పరిస్థితి.. చేపలు, రొయ్యల సాగు చేపట్టాలంటే ప్రతి సీజన్లోనూ నీరు, మట్టి, పరీక్షలు తప్పనిసరి. చేప, రొయ్య పిల్లల నాణ్యత, వ్యాధులను గుర్తించేందుకు తరచూ పరీక్షలు చేయించాల్సి ఉంటుంది. ఇలాంటి సేవలు సమీకృత ప్రయోగశాలల్లో అందుబాటులో లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు ల్యాబ్‌లకు వెళ్లి పెద్ద మొత్తాల్లో ఖర్చు చేయాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

● ప్రతి కేంద్రంలో ఒక మత్స్యశాఖ అధికారితో పాటు ఇద్దరు సాంకేతిక నిపుణులు ఉండాలి. వ్యవసాయశాఖకు సంబంధించి ఒక అధికారి ఇద్దరు సహాయకులు ఉండాలి. ప్రస్తుతం ఎక్కడా తగినంత సిబ్బంది లేదు. సాంకేతిక సిబ్బందిని నియమించకుండా వీటి వల్ల ఉపయోగం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

● భీమవరంలో సముద్ర ఉత్పత్తుల ఎగుమతి, అభివృద్ధి సంస్థ(ఎంపెడా) కార్యాలయం ఏర్పాటు నిమిత్తం 2018లో అప్పటి ప్రభుత్వం రూ.కోట్ల విలువైన 60 సెంట్ల భూమిని ప్రత్యేక జీవో ద్వారా కేటాయించింది. భవన నిర్మాణానికి ఎంపెడా 2021లో 16.6 కోట్లు మంజూరు చేసింది. 2022లో పనులు ప్రారంభం కాగా ఇప్పటికీ కొలిక్కి రాలేదు.

ఇబ్బంది లేకుండా చర్యలు

సాంకేతిక ఉద్యోగుల కొరత ఉన్న విషయం వాస్తవమేనని, అందుబాటులో ఉన్న సిబ్బందితో రైతులకు తగిన సేవలందిస్తున్నామని మత్స్యశాఖ జిల్లా అధికారి ప్రసాద్ తెలిపారు. ప్రయోగశాలలు ప్రారంభమైన చోట పలు పరీక్షలు చేస్తున్నామని భీమవరం డివిజన్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు శ్రీనివాస్ తెలిపారు. భీమవరం ల్యాబ్‌లో ఇప్పటి వరకు 170 సీడ్ పరీక్షలు చేశామని చెప్పారు.

వైద్యులు అందుబాటులో ఉండాల్సిందే


మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: పని వేళల్లో వైద్యులు కచ్చితంగా ఆసుపత్రుల్లో అందుబాటులో ఉండాల్సిందేనని కలెక్టర్ నాగరాణి స్పష్టం చేశారు. ప్రాంతీయ ఆసుపత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాల పని తీరుపై ఆమె బుధవారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదు తప్పనిసరని పేర్కొన్నారు. కొన్ని వైద్య సేవలకు సొమ్ము వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని.. దీనిపై ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు. మెరుగైన వైద్య సేవల ద్వారా ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం కలిగించాలని సూచించారు. ఆసుపత్రుల్లో ప్రసవాలు పెరిగేలా, గర్భిణుల్లో రక్తహీనత సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు. ఆకివీడు, ఆచంట ఆసుపత్రుల్లో వైద్యసేవలను మెరుగుపరచాలన్నారు. అవసరమైన పరికరాలు కొనుగోలు చేయాలని, ఆయుష్మాన్ భారత్ రిజిస్ట్రేషన్లు చేయించాలని వైద్యాధికారులకు సూచించారు. వైద్యఆరోగ్యశాఖ జిల్లా అధికారి ఉమామహేశ్వరరావు, డీసీహెచ్ఎస్ సూర్యనారాయణ, ఏపీఎంఐడీసీ డీఈ శ్రీనివాసరెడ్డి, సివిల్ సర్జన్ అండ్ గైనకాలజిస్ట్ అరుణ తదితరులు పాల్గొన్నారు.



కొల్లేరుకు కొత్తందాలు

విదేశీ విహంగాలతో సందడి



కైకలూరు, న్యూస్‌టుడే: కొల్లేటి సరస్సులో జలకాలాడేందుకు రివ్వున ఎగురుతూ వచ్చేశాయి నిండు కుండలా ఉన్నా కొల్లేరులో చేపలను ఒడిసి పట్టేందుకు ఇవి చేస్తున్న విన్యాసాలు చూపరులను కట్టి పడేస్తున్నాయి. ఇక మత్స్య సంపదకు స్వర్గధామమైన కొల్లేటి సరస్సు నివాస యోగ్యం.. సంతానోత్పత్తికి పూర్తి అనుకూలం కావడంతో వేల కిలోమీటర్లు గగన తలంలో విహరిస్తూ ప్రతి ఏటా ఇక్కడకు చేరుతుంటాయి. సాధారణంగా అక్టోబరు చివరి నుంచి శీతల వాతావరణం ఉండటంతో ఈ సమయంలో విదేశీ విహంగాలు కొల్లేరుకు చేరుకుంటాయి. ఫిబ్రవరి వరకు కొల్లేరుతో పాటు ఆటపాక వలస పక్షుల సందర్శన కేంద్రంలో సందడి చేస్తుంటాయి.



☛ తాడేపల్లిగూడెం మండలం కృష్ణాయపాలెంలో రేషన్ బియ్యాన్ని మినీ వ్యానులో అక్రమంగా తరలిస్తుండగా గ్రామీణ పోలీసులు పట్టుకున్నారు. బాధ్యుడైన సత్తిరాజుపై కేసు నమోదు చేశారు.

☛ పెదతాడేపల్లిలోని ఓ గోదాములో భారీగా రేషన్ బియ్యం నిల్వ ఉంచారనే సమాచారం మేరకు విజిలెన్సుల అధికారులు తనిఖీ చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన 145 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేశారు.

కిలో రూ.16 చొప్పున సేకరణ.. బియ్యం కార్డుదారులకు ప్రభుత్వం ఉచితంగా బియ్యం సరఫరా చేస్తుంది. అయితే ఈ బియ్యాన్ని వినియోగించుకోవడానికి అంతగా ఎవరూ ఆసక్తి చూపడం లేదు. ఇదే అదునుగా కొంతమంది దళారులు కార్డుదారుల నుంచి కిలో రూ.15 నుంచి రూ.16 వరకు కొనుగోలు చేస్తున్నారు. తర్వాత వీటిని మూటలు కట్టి మిల్లర్లకు, కోళ్ల ఫారాలకు చేరవేస్తున్నారు.

నల్లబజారుకు చౌక బియ్యం

కొరవడిన అధికారుల పర్యవేక్షణ

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: ఉభయ జిల్లాల్లో ప్రజా పంపిణీ వ్యవస్థ గాడి తప్పింది. క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ కొరవడటం, యంత్రాంగం చూసి చూడనట్లు వ్యవహరిస్తుండటంతో పేదలకు రాయితీపై అందిస్తున్న చౌక బియ్యం యథేచ్ఛగా నల్లబజారుకు తరలిపోతోంది. తాడేపల్లిగూడెం కేంద్రంగా ఈ తరహా వ్యాపారం ఇటీవల జోరందుకుంటుంది. కొంతమంది డీలర్లు, మిల్లర్లు, ఎంఎస్‌వోలు కుమ్మక్కై అడ్డదారిలో సేకరించిన బియ్యాన్ని గ్రామీణ ప్రాంతాల్లోని నివాసాలు, గోదాముల్లో పెద్ద మొత్తంలో నిల్వ ఉంచుతున్నారు. వీటిని గుట్టుచప్పుడు కాకుండా కాకినాడ పోర్టు ద్వారా విదేశాలకు అక్రమంగా రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మరికొంత మంది స్థానికంగా ఉండే పలు మిల్లులకు తీసుకెళ్లి రీసైక్లింగ్ చేస్తూ అధిక ధరలకు విక్రయిస్తున్నారు. పోలీసు, విజిలెన్సు అధికారుల తనిఖీల్లో పట్టుబడితే తప్ప అక్రమాలు వెలుగు చూడటం లేదు. సంబంధిత శాఖ అధికారులు బియ్యం అక్రమ నిల్వలు, తరలింపు విషయంలో చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఉమ్మడి జిల్లాలో తెల్లకార్డుదారులు	11,73,067
చౌకదుకాణాలు	2,214
పంపిణీకి కేటాయించే బియ్యం	17 వేల మెట్రిక్ టన్నులు
అక్రమంగా తరలిస్తున్న బియ్యం	అయిదు మెట్రిక్ టన్నులు (సుమారు)

☛ ప్రతి నెలా 1 నుంచి 17 వరకు రేషన్ సరుకుల పంపిణీ జరుగుతోంది. రోజూ చౌక దుకాణం నుంచి సరకులు తీసుకువెళ్లే ఎంపీడీయూ ఆపరేటర్ పంపిణీ ముగిశాక మిగిలిన సరకు డీలర్‌కు అప్పగించాలి. పంపిణీ పూర్తయిన తరువాత ఎంఎస్‌వోలు ఎంత సరకు పంపిణీ జరిగింది..ఎంత నిల్వలు చౌక దుకాణంలో ఉన్నాయో తనిఖీ చేయాలి. ఎంఎస్‌వోలు ఇవేవీ పట్టించుకోకపోవడం వల్ల అక్రమాలకు మరింత ఊతం ఇస్తోంది. " రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నాం. పేదల బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకుంటాం." అని విజిలెన్సు సీఐ శివరామకృష్ణ అన్నారు.

ఇక.. అందుబాటులో నచ్చిన మద్యం..


భీమవరంలో దుకాణం

భీమవరం పట్టణం, పాలకోడేరు, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రైవేటు మద్యం దుకాణాలు బుధవారం ప్రారంభమయ్యాయి. 175 దుకాణాలకు కొన్నిచోట్ల ఇంకా మద్యం చేరలేదు. మిగిలిన చోట్ల మద్యం రావడంతో కొనుగోలుకు ఆసక్తి చూపారు. కొన్ని చోట్ల రూ.120, 150, 180 రకాలతో పాటు ప్రముఖ బ్రాండ్ల మద్యం కోసం ఎక్కువగా వచ్చారు. డిపోల నుంచి మద్యం వచ్చిన వెంటనే ఆయా ప్రాంతాల్లోని దుకాణాలను అట్టహాసంగా ప్రారంభించారు.

● పాలకోడేరు మండలంలోని మందుబాబులకు నిరాశే మిగిలింది. నాలుగు మద్యం దుకాణాలకు స్టాకు రాకపోవడంతో ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. పాలకోడేరు, మొగల్లు, పెన్నాడ, శృంగవృక్షంలలో దుకాణాలను గురువారం ప్రారంభించనున్నట్లు వ్యాపారులు తెలిపారు.

మొదలైన మంతనాలు

ఈనాడు డిజిటల్, భీమవరం, తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో మద్యం దుకాణాల లాటరీలో షాపు వచ్చిన వారితో బేరసారాలు మొదలయ్యాయి. దుకాణం ఇచ్చేస్తే గుడ్‌విల్ ఇస్తామంటూ ఆఫర్లు ప్రకటిస్తున్నారు. అవి ఏర్పాటు చేసే ప్రాంతాలు, అక్కడ జరిగే విక్రయాలు బట్టి గరిష్ఠంగా రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షలు ఇచ్చేందుకు సిద్ధపడుతున్నారు. ● గతంలో 191 ప్రైవేటు మద్యం దుకాణాల ద్వారా రోజూ రూ.2.30 కోట్ల వ్యాపారం జరిగేది. ఎన్డీఏ ప్రభుత్వం వాటిని రద్దు చేసి ప్రైవేటుకు అప్పగించేందుకు లాటరీ ప్రక్రియ నిర్వహించింది. కొన్ని నియోజకవర్గాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీ నాయకులే సిండికేట్‌గా మారి దుకాణాలు దక్కించుకున్నారు. భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు సర్కిళ్ల పరిధిలో గుడ్‌విల్‌కు వాటిని దక్కించుకునేందుకు మంతనాలు సాగిస్తున్నారు. రెండేళ్లు వచ్చే లాభాలు, పోలీసులు, రాజకీయ నాయకుల ఒత్తిడి బేరీజు వేసుకుని లాటరీలో వచ్చినవారు సైతం ఇచ్చేందుకు సిద్ధపడుతున్నారు.

వేల టన్నులు.. క్షణాల్లో ఖాళీ!



భీమవరం టూటౌన్, పాలకోడేరు, న్యూస్‌టుడే: ఉచిత ఇసుక విధానం ఇప్పుడిప్పుడే గాడిన పడుతుండగా గతంతో పోలిస్తే లభ్యత కాస్త పెరిగింది. కానీ డిమాండ్ అధికంగా ఉండటంతో ఆన్‌లైన్ బుకింగ్‌కు ఉంచిన నిల్వలన్నీ క్షణాల్లోనే ఖాళీ అవుతున్నాయి. ప్రభుత్వ నిర్ణయం మేరకు బుధవారం నుంచి పలు రీచ్‌లు అందుబాటులోకి వచ్చాయి. జిల్లా పరిధిలో రీచ్‌లు సీఆర్‌జడ్ పరిధిలో ఉండటంతో ఇంకా తెరచుకోలేదు. తూర్పుగోదావరి జిల్లాలో 8 రీచ్‌లు తెరచుకోగా.. గోదావరి నదిలో ప్రవాహం మరింత తగ్గితే పూర్తిస్థాయిలో ఇసుక అందుబాటులోకి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఇదీ పరిస్థితి.. ఆన్‌లైన్ బుకింగ్‌కు ప్రతి రోజు మధ్యాహ్నం 12 గంటలకు మూడు రోజుల స్లాట్‌లను రీచ్‌ల వారీగా అందుబాటులో ఉంచుతున్నారు. బుధవారం ఇదే విధంగా సుమారు 18,500 టన్నులకు స్లాట్లు ఉంచగా క్షణాల్లోనే బుకింగ్‌లు పూర్తయ్యాయి. దళారులు పెద్దఎత్తున బుకింగ్‌లు చేస్తుండటంతో సామాన్య వినియోగదారులకు అవకాశం దక్కడం లేదు. ఈ క్రమంలో నిర్మాణదారులు దళారులను ఆశ్రయిస్తున్నారు. లారీ ఇసుకకు రూ.5 వేల నుంచి రూ.10వేలు వరకు అధికంగా వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

దోపిడీ ఇలా.. తూర్పుగోదావరి జిల్లా పెండ్యాల రీచ్‌లో టన్ను ఇసుకకు నిర్వహణ రుసుములు రూ.270 చెల్లించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో బుక్ చేస్తే రవాణా ఛార్జీలతో 20 టన్నులు ఇసుక ఆచంట చేరడానికి రూ.12 వేల వరకు అవుతోంది. కానీ దళారులు సుమారు రూ.18 వేల నుంచి రూ.20 వేల వరకు గుంజుతున్నారు. ఇదే ఇసుక భీమవరం చేరాలంటే రూ.25 వేల వరకు వసూలు చేస్తున్నారు.

తెరచిన రీచ్‌లు (తూర్పుగోదావరి జిల్లా).. ఔరంగాబాద్-1, ఔరంగాబాద్-2, దొంగగుంట రేవు, ఎరీనమ్మ, కొవ్వూరు, పెండ్యాల, వాడపల్లి, రాజమహేంద్రవరం(కోటి లింగాల రేవు).

బదిలీల్లో చేతివాటం

వైద్య ఆరోగ్యశాఖలో కలకలం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: వైద్య, ఆరోగ్యశాఖలో ఇటీవల జరిగిన ఉద్యోన్నతి బదిలీల్లో భారీగా సొమ్ము చేతులు మారిన వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే ఓ ఉద్యోగిపై అధికారికంగా చర్యలు తీసుకున్నారు.

లిఖిత పూర్వక ఫిర్యాదుతో.. ఏఎన్ఎంలకు ఉద్యోన్నతుల బదిలీలు ఇటీవల నిర్వహించారు. ఆ సమయంలో ఈ శాఖకు చెందిన కొందరు ఉద్యోగులు రంగంలోకి దిగి ముడుపులు ఇస్తే నచ్చిన చోటుకు బదిలీ చేయిస్తామంటూ నమ్మించారు. ఎన్‌హెచ్ఎం విభాగంలో జిల్లా ప్రాజెక్టు అధికారి పి.సురేశ్ రూ. 20 వేలు తీసుకున్నట్లు ఓ ఏఎన్ఎం లిఖిత పూర్వకంగా ఫిర్యాదుతో అతడిని ఎన్‌హెచ్ఎం ఉన్నత కార్యాలయానికి సరెండర్ చేసినట్లు డీఎంహెచ్‌వో డి.మహేశ్వరరావు చెప్పారు.



బడుగు వికాసం.. అప్పులతో సతమతం

కాగితాల్లో సొమ్ములు ఖాతాల్లోకి వచ్చేదెప్పుడో ● రాయితీ సొమ్ముకు నిరీక్షణ

ఈనాడు డిజిటల్, భీమవరం, తణుకు గ్రామీణం, మొగల్తూరు, న్యూస్‌టుడే

● బ్యాంకు లోను ద్వారా బస్సు కొనుగోలు చేసి, తణుకు డిపోలో నడుపుతున్నాను. ఆదాయం రాకపోగా రూ.45వేలు అదనంగా ఖర్చవుతోంది. రాయితీ సొమ్ము విడుదల కాకపోవడంతో బ్యాంకు సిబ్బంది సొమ్ము చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని సతీశ్ వాపోయారు.

● తాడేపల్లిగూడెం డిపోలో రెండు బస్సులు తిప్పుతున్నా. రాయితీ రుణం రూ.30 లక్షలకు పైగా రావాలి. బ్యాంకుకు ప్రతి నెలా రూ.1.20 లక్షలు చెల్లిస్తున్నా. అప్పు తీర్చేందుకు మరో అప్పు చేయాల్సి వస్తోందని మౌనిక ఆవేదన వ్యక్తం చేశారు.

● నరసాపురం డిపోలో మూడు బస్సులు తిప్పేందుకు అనుమతివ్వడంతో అప్పులు చేసి బస్సులు కొన్నా. రాయితీ సొమ్ము జమ కాకపోవడంతో ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నామని రమ్య వాపోయారు.

గత వైకాపా ప్రభుత్వ నిర్ణయాలు బడుగు, బలహీన వర్గాలకు నేటికీ శాపంగా మారాయి. కాగితాల్లో చూపిన రాయితీ సొమ్ములు ఖాతాకు జమకాకపోవడంతో అభివృద్ధి మాట ఎలాగున్నా వారిని మరింత అప్పుల ఊబిలోకి నెట్టేశాయి. అటు బ్యాంకులకు కిస్తీలు, ఇటు చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక నానా అవస్థలు పడుతున్నామని, కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

అప్పులు చేసి.. 'జగనన్న బడుగు వికాసం' పేరిట ఎస్సీ, ఎస్టీలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కేటాయించిన సుమారు రూ.22.10 కోట్ల రాయితీ నగదు నేటికీ వారి ఖాతాకు జమ కాలేదు. దళిత, గిరిజనులకు మాయమాటలు చెప్పి, ఒప్పించి వాహనాలను కొనుగోలు చేయించారు. రాయితీ మాత్రం అర్హుల ఖాతాల్లో వేయలేదు. కాగితాల్లో మాత్రం ఇచ్చినట్లు చూపడం గమనార్హం. ప్రస్తుతం వారంతా బ్యాంకు లోన్లు తీర్చేందుకు నానా అవస్థలు పడుతున్నారు.

● ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పాలసీలో భాగంగా 2020-23 ఆర్థిక సంవత్సరాల మధ్య పథకం అమలు చేశారు. అవసరమైన వారికి పరిశ్రమల శాఖ ద్వారా రుణాలు అందించారు. వాహన విలువలో 45 శాతం రాయితీ కాగా, 15 శాతం లబ్ధిదారులు చెల్లించాలి. మిగిలిన మొత్తం బ్యాంకు రుణంగా మంజూరు చేశారు. దీనిని 11 శాతం వడ్డీతో వాయిదాల రూపంలో చెల్లించాలి. ఏటా ఆగస్టులో రాయితీ సొమ్ము విడుదల చేస్తామన్నా, రూపాయి కూడా విడుదల కాలేదు.

దీనిపై ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల పరిశ్రమల శాఖ అధికారులు సుబ్రహ్మణ్యేశ్వరరావు, మంగపతి స్పందిస్తూ... దస్త్రాలన్నింటినీ ఉన్నతాధికారులకు పంపామని, ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలన్నారు.

వరి చేలపై ముప్పేట దాడి..! 8లో
61 అన్నారు.. ఒక్కటే కట్టారు

పురాలకు చెత్త భారం

సమ్మెబాటలో క్లాప్ వాహన చోదకులు



చర్చిస్తున్న సహాయ కమిషనర్ వెంకటేశ్వరరావు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణాల్లో చెత్త సేకరణకు ఉపయోగిస్తున్న క్లాప్ వాహనాలు నిలిచిపోతున్నాయి. వేతన బకాయిలు చెల్లించాలంటూ చోదకులు భీమవరం పట్టణంలో ఆ వాహనాల చోదకులు ఇప్పటికే విధులను బహిష్కరించగా మిగిలిన చోట్ల కూడా సమ్మెకు సిద్ధమయ్యారు. ఈ సమస్యకు పరిష్కారం లభించకుంటే పురాల్లో చెత్త తరలింపు ప్రక్రియ నిలిచిపోయే ప్రమాదముంది.

వైకాపా ప్రభుత్వ హయాంలో పట్టణాలకు శాశ్వత ప్రాతిపదికన చెత్త తరలింపు వాహనాలు సమకూర్చలేదు. ఉమ్మడి జిల్లాలో అన్ని పట్టణాలకు 400కుపైగా వాహనాలను ప్రైవేటు ఏజెన్సీ ఆధ్వర్యంలో సమకూర్చారు. వాటికి పర్యవేక్షకులు, చోదకులను నియమించారు. సిబ్బందికి వేతనాలు, నిర్వహణ బాధ్యత సంబంధిత ఏజెన్సీదే. వీటికి చెల్లించాల్సిన నగదు భారాన్ని చెత్త పన్ను రూపంలో ప్రజలపై వేశారు. ప్రాంతాలను బట్టి ప్రతి ఇంటికి రూ. 30 నుంచి రూ. 90 వరకు వసూలు చేశారు. ఇలా వసూలు చేసిన మొత్తాన్ని ఒక్కో వాహనానికి రూ. 50 వేల నుంచి రూ. 53 వేల వరకు చెల్లించారు. తడి, పొడిగా చెత్తను వేర్వేరుగా సేకరిస్తారంటూ మైకుల్లో ప్రచారం మిగిలింది అమలు చేయలేదు. ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో ఎన్నికల సమయంలో చెత్త పన్ను వసూలు నిలిపివేశారు. అప్పట్నుంచి వాహనాలకు చెల్లించాల్సిన బకాయిలు నిలిచిపోయాయి. గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సమకూర్చిన వాహనాలే ఇప్పటికీ సేవలందిస్తున్నాయి.

ఆర్థిక ఇబ్బందులతో సతమతం.. ఉమ్మడి జిల్లా పరిధిలో దాదాపు 450 మంది క్లాప్ వాహనాల చోదకులు, పర్యవేక్షకులుగా పనిచేస్తున్నారు. గత కొన్నినెలలుగా వేతనాలు అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమవుతున్నట్లు వీరంతా వాపోతున్నారు. భీమవరం పట్టణ పరిధిలో సిబ్బంది ఇప్పటికే విధులను బహిష్కరించగా అధికారులు చర్చలు జరిపారు. దీనిపై ఉన్నత స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని స్థానిక అధికారులు చెబుతున్నారు.

రతన్‌టాటా విగ్రహం తయారీ



నమూనా విగ్రహానికి మెరుగులు దిద్దుతున్న కరుణాకర్ ఉడయార్

పెనుమంట్ర, న్యూస్‌టుడే: పెనుమంట్ర మండలం నత్తారామేశ్వరంలో పారిశ్రామికవేత్త రతన్ టాటా విగ్రహాన్ని తయారు చేస్తున్నారు. శిల్పి పెనుగొండ కరుణాకర్ ఉడయార్ నమూనా విగ్రహానికి తుది మెరుగులు దిద్దుతున్నారు. ఈ నమూనాను ఏడున్నర అడుగుల కాంస్య విగ్రహంగా తీర్చిదిద్దనున్నట్లు ఆయన 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ఉండికి చెందిన ప్రజాప్రతినిధి ఇచ్చిన ఆర్డర్ మేరకు ఈ విగ్రహం తయారు చేస్తున్నట్లు చెప్పారు.

అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారిణుల ప్రతిభ



విజేతలతో శిక్షకులు

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే: హిమాచల్‌ప్రదేశ్‌లో ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ యూత్, జూనియర్, సీనియర్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఏలూరు క్రీడాకారిణులు ప్రతిభ చూపారు. 81+ కిలోల విభాగంలో పి.దివ్య రజతం, 77 కిలోల విభాగంలో పి.ఆర్.డి.నోమిల్ కాంస్య పతకాలు సాధించారు. వీరిని ఎమ్మెల్యే బడేటి చంటి, జిల్లా డీఎస్‌డీవో బి.శ్రీనివాసరావు, వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ అధ్యక్షులు నెలకుర్తి లక్ష్మి, ఇండియన్ సమాఖ్య ఉపాధ్యక్షుడు బడేటి వెంకట్రామయ్య, రాష్ట్ర కార్యదర్శి టి.దిన్నాబాబు, అర్జున్ అవార్డీ, శిక్షకులు అభినందించారు.

వరి చేలపై ముప్పేట దాడి!

- వేధిస్తున్న ప్రతికూల వాతావరణం
- తెగుళ్ల వ్యాప్తి.. ఆపై ఎలుకల బెడద

ఉండి, న్యూస్‌టుడే

తీవ్రమైన ఎండ.. ఉక్కబోత.. అంతలోనే ఆకస్మికంగా మేఘాలు కమ్మేసి భారీ వర్షాలు.. ఇలాంటి విభిన్న వాతావరణ పరిస్థితులు వరి సాగుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 5.50 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగవుతుండగా అన్ని ప్రాంతాల్లోనూ తెగుళ్లు, కీటకాలు, ఎలుకల బెడద వెంటాడుతోంది. అధికశాతం విస్తీర్ణంలో వరి చేలు ప్రస్తుతం చిరుపొట్ట నుంచి గింజ తయారయ్యే కీలక దశలో ఉన్నాయి. ఇలాంటి తరుణంలో మాగుడు (పొడ), బ్యాక్టీరియా ఎండాకు (బీఎల్‌బీ), మానిపండు తెగులు వ్యాప్తి అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తోంది. తెగుళ్ల వ్యాప్తిని అరికట్టేందుకు చేపట్టాల్సిన చర్యలపై మార్టేరు వరి పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు పలు సూచనలు చేస్తున్నారు. వివరాలు ఇవీ..



బీఎల్‌బీ సోకిన వరి చేను

బ్యాక్టీరియా ఎండాకు (బీఎల్‌బీ)

అధికంగా నత్రజని ఎరువులు వాడటం, పొటాష్ సరిగా చల్లకపోవడం, తెగులు సోకిన పొలాల్లోంచి సాగునీటి ప్రవాహం వంటి కారణాలతో వ్యాపిస్తోన్న బ్యాక్టీరియా ఎండాకు తెగులు సమస్యాత్మకంగా తయారైంది. చేను ఈనిక దశలో ఈ తెగులు ఆశిస్తే పిలకలు ఎండిపోతాయి. కొన్ని వెన్నులే బయటకొచ్చి తాలు గింజలు ఏర్పడతాయి. నివారణకు పంట ప్రారంభంలోనే ఎకరానికి 24 కిలోల లోపు నత్రజని చల్లుకోవాలి. పొటాష్ ఎరువులు కచ్చితంగా వేయాలి. తుంగ, చిప్పెర, గరిక, ఊద, గాబేరు వంటి గడ్డి జాతి కలుపు మొక్కలు నివారించాలి. తెలుగు లక్షణాలు కనిపిస్తే చేలలో నీటిని రెండు, మూడు సార్లు బయటకు మళ్లించాలని తెగుళ్ల విభాగం ప్రధాన శాస్త్రవేత్త వి.భువనేశ్వరి, విస్తరణ విభాగం ప్రధాన శాస్త్రవేత్త ఎంవీ కృష్ణాజీ తెలిపారు.

మాడుగు

వర్షాలు, అధిక నత్రజని చల్లిన చేలలో మొక్కలకు గాలి తగలకపోవడం, దుబ్బులు పడిపోయినచోట్ల ఈ తెగులు త్వరగా వ్యాపిస్తోంది. వెన్ను బయటకొచ్చే దశలో ఆశిస్తే తాలు గింజలు ఏర్పడి నాణ్యత, బరువు తగ్గిపోయే ప్రమాదముంది. అనుకూల వాతావరణంలో 5 శాతం హెక్సాకొనజోల్ 2.0 ఎంఎల్/ వాలిడామైసిన్ 2 ఎంఎల్/ ప్రొపికొనజోల్ ఒక ఎంఎల్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

మానిపండు

అధికవర్షపాతం నమోదైన సంవత్సరాల్లో ఈ తెగులు వ్యాప్తి కనిపిస్తోంది. చిరుపొట్ట నుంచి పూత దశలో వర్షం లేదా మంచు ఎక్కువగా ఉన్నా ఈ తెగులు ఆశిస్తోంది. వెన్నులో గింజలకు బదులు గుండ్రని శిలీంధ్ర బీజ సముదాయాలు ఏర్పడతాయి. తొలుత పసుపు, తరువాత ముదురు ఆకుపచ్చ, నలుపు రంగులోకి మారి ధాన్యం నాణ్యతను దెబ్బతీస్తోంది. ఒక ఎంఎల్ ప్రొపికొనజోల్ లీటరు నీటిలో కలిపి చిరుపొట్ట, పూత దశల్లో పిచికారీ చేసుకోవాలని శాస్త్రవేత్తలు సూచించారు.



తెగులు సోకిన వరి కంకులు

ప్రగతి బాటలో పల్లెలు : కలెక్టర్

అత్తిలి (గ్రామీణ), న్యూస్‌టుడే: పల్లెలను ప్రగతి బాటలో నడిపించేలా ప్రభుత్వం పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతోందని కలెక్టర్ సీహెచ్ నాగరాణి అన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా బుధవారం అత్తిలి మండలం ఉరదాళ్లపాలెంలో రూ.1.10 కోట్లతో నిర్మించే అంతర్గత డ్రైనేజ్, సీసీ రహదారుల నిర్మాణానికి ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణతో కలిసి భూమిపూజలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ నిధులతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. పనుల్లో నాణ్యత ఉండేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు పరిశీలించాలన్నారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో రాష్ట్రంలో అనేక అభివృద్ధి పనులకు నాంది పలికారన్నారు. వచ్చే సంక్రాంతి నాటికి నిర్మాణాలు పూర్తయ్యేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ అప్పారావు, తహసీల్దార్ దశిక వంశీ, ఎంపీడీవో శామ్యూల్, నాయకులు దాసం బాబ్జీ, తాతాజీ, పంచాయతీ రాజ్ డీఈ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అలసత్వం వహిస్తే చర్యలు.. భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ వైద్య సేవల పరిధిలో ఆసుపత్రులు పేదలకు పూర్తిగా ఉచిత వైద్యం అందించాలని కలెక్టర్ నాగరాణి బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో స్పష్టం చేశారు. కొన్ని ఆసుపత్రుల్లో రోగుల నుంచి నగదు వసూలు చేస్తున్నారని, వైద్య సేవల్లో అలసత్వం వహిస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని వెల్లడించారు. ప్రభుత్వ ఉత్తర్వులు అమలు చేయని యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా సమన్వయాధికారి కీర్తి, ఐఎంఏ అధ్యక్షులు బాలకృష్ణారావు, వివిధ ఆసుపత్రుల ప్రతినిధులు, వైద్యులు పాల్గొన్నారు.

పురపాలక ఉపాధ్యాయులకు అవకాశమివ్వండి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఎస్సీఈ ఆర్‌టీలో డిప్యుటేషన్ ప్రాతిపదికన అధ్యాపక పోస్టుల భర్తీలో పురపాలక ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పీవీ విజయరామరాజు కోరారు. ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన ఉత్తర్వుల్లో ఈ కొలువులకు ప్రభుత్వ, జిల్లా పరిషత్తు పాఠశాల ఉపాధ్యాయులను మాత్రమే అర్హులుగా పేర్కొందన్నారు.

వసతి గృహాల్లో డిజిటల్ బోధన

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: వెనుకబడిన తరగతుల (బీసీ) సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా వసతి గృహాల్లో డిజిటల్ బోధన అందుబాటులోకి తెస్తోంది. దీనికి జిల్లాలో పెనుగొండ బాలుర వసతి గృహాన్ని తొలి విడతలో ఎంపిక చేసినట్లు బీసీ సంక్షేమ, సాధికారత అధికారి గణపతిరావు చెప్పారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు డిజిటల్ తరగతుల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దీనికి ఓ గదిని కేటాయించామన్నారు. డిజిటల్ తరగతులను సద్వినియోగం చేసుకునేలా పెనుగొండ పరిసరాల్లో ఇతర వసతి గృహాల విద్యార్థులను తీసుకొచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

17 నుంచి నిట్‌లో టెక్రియా 2కే24



సన్నాహక కార్యక్రమంలో రిజిస్ట్రార్ దినేష్‌శంకర్‌రెడ్డి తదితరులు

తాడేపల్లిగూడెం టూటౌన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం ఏపీ నిట్‌లో టెక్రియా 2కే24 కార్యక్రమాలను ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు కళాశాల ఇన్‌ఛార్జి డైరెక్టర్ బీఎస్ మూర్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ దినేష్‌శంకర్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు బుధవారం కళాశాల గ్రంథాలయం వద్ద సన్నాహక కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు నృత్యాలు చేయడంతోపాటు తమ ఆటపాటలతో అలరించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో వైజ్ఞానిక స్ఫూర్తిని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. విద్యార్థులు వినూత్న ఆలోచనలు చేస్తూ సమాజహిత పరిశోధనలపై దృష్టి సారించాలన్నారు. 17వ తేదీ సాయంత్రం 5 గంటలకు గ్రంథాలయం వద్ద బైక్ స్టంట్‌షో, 18, 19 తేదీల్లో ఇస్రో ఎగ్జిబిషన్, టెక్నికల్ ఈవెంట్స్ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో డీన్ (స్టూడెంట్స్ వెల్ఫేర్) జీపీ.రాజేష్, అసోసియేట్ డీన్ వి.సందీప్, ఆచార్యులు తలారి రేష్మ తదితరులు పాల్గొన్నారు.

పీజీ సీట్ల కేటాయింపునకు కసరత్తు

ఏలూరు నేరవాల్లు, న్యూస్‌టుడే: సర్వజన ఆసుపత్రికి పీజీ సీట్ల కేటాయింపులో భాగంగా సౌకర్యాల పరిశీలనకు డీఎంఈ బృందం వచ్చింది. పలు విభాగాలను పరిశీలించింది. ఇక్కడి ప్రత్యేక విభాగాలకు ఒక్కో మెడికల్ పీజీ సీటు కేటాయించనున్న నేపథ్యంలో... గుంటూరు, విజయవాడ ప్రభుత్వ వైద్య కళాశాలల ఆచార్యులు ఉషారాణి, సౌజన్య తదితరుల బృందం ప్రసూతి విభాగాలను పరిశీలించింది. గురు, శుక్రవారాల్లోనూ పర్యటన కొనసాగనుంది. ఇక్కడి సౌకర్యాలపై నివేదిక రూపొందించి డీఎంఈకు అందించనున్నారు

సీఎం సహాయనిధికి రూ.5 లక్షలు



చంద్రబాబుకు చెక్కు ఇస్తున్న వాకర్స్ ప్రతినిధులు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం దాతల నుంచి వాకర్స్ ఇంటర్నేషనల్ సభ్యులు రూ.5 లక్షలు విరాళాలు సేకరించారు. అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును బుధవారం కలిసి నగదు మొత్తాన్ని చెక్కు రూపంలో సహాయనిధికి అందజేశారు. వారిని చంద్రబాబు అభినందించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు వి.మురళీమోహనరావు, సభ్యులు పాల్గొన్నారు.

త్వరితగతిన అభివృద్ధి పనులు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా పరిషత్తు పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ఆదేశించారు. స్థానిక జడ్పీ కార్యాలయంలో భీమవరం, జంగారెడ్డిగూడెం, రాజమహేంద్రవరం, నరసాపురం, కొవ్వూరు డివిజన్ల ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. జడ్పీ సీఈవో కేఎస్ఎస్ సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ... ఆయా మండలాల్లో మంజూరైన పనుల పురోగతిపై సూచనలు చేశారు. అభివృద్ధి పనుల్లో జాప్యం చేయొద్దని దిశానిర్దేశం చేశారు. ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుని పనులు పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఛైర్‌పర్సన్ పద్మశ్రీ

శిథిలావస్థలో స్లూయిజ్!

నరసాపురం మండలం పాతనవరసపురం, యలమంచిలి మండలం ఏనుగువానిలంక మధ్య ఉన్న కాజ అవుట్‌ఫాల్ స్లూయిజ్ శిథిలావస్థలో ఉంది. వశిష్ఠగోదావరికి వరదలొచ్చినప్పుడు నీరు పైకి రాకుండా షట్టర్లు వాటంతట అవే మూసుకుపోయి, వరద తగ్గినప్పుడు షట్టర్లు తెరుచుకొని మురుగునీరు కిందికి వెళ్లేందుకు వీలుగా దీనిని గతంలో నిర్మించారు. ప్రస్తుతం ఇది శిథిలావస్థకు చేరుకోవడంతో షట్టర్లు పనిచేయడం లేదు. గోడలు బీటలువారి, ఊచలుతేలి ప్రమాదకరంగా ఉన్నాయి. దీంతో తుపాన్లు, వరదలప్పుడు రెండు మండలాల్లోని గ్రామాలు, పంటపొలాలు ముంపునకు గురవుతున్నాయి. అయిదేళ్ల వైకాపా ఏలుబడిలో దీనిని పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. **-ఈనాడు, నరసాపురం**





బీటలువారి, ఊచలుతేలి పెచ్చులూడుతున్న గోడలు



పనిచేయని షట్టర్లు

వర్షాలతో కలవరం!



వీరవాసరంలో జోరువాన

వీరవాసరం, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడన ప్రభావంతో బుధవారం ఉదయం నుంచి పలు ప్రాంతాల్లో చెదురుమదురు వర్షాలు కురిశాయి. సాయంత్రం 4 గంటల తరువాత వీరవాసరం, భీమవరం, పాలకోడేరు ప్రాంతాల్లో ఆకాశం మొత్తం మేఘావృతమై భారీ వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. పాఠశాలలు, కార్యాలయాల నుంచి వచ్చే విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వీరవాసరంలో 165వ నంబరు జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. వరిచేలు కీలక దశలో ఉన్న వేళ వర్షాలు కురుస్తుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

వర్షపాతం ఇలా.. **భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే:** మంగళవారం నుంచి బుధవారం ఉదయం వరకు జిల్లాలో 1.9 మి.మీ. సగటు వర్షపాతం వర్షపాతం నమోదైంది. అత్యధికంగా తాడేపల్లిగూడెం మండలంలో 8.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. పాలకొల్లు 7.2, ఆచంట, వీరవాసరం 3.2, పెంటపాడు, ఉండి 2.4, మిగిలిన మండలాల్లో 2 మిల్లీమీటర్ల లోపు వర్షపాతం నమోదైంది.

61 అన్నారు... ఒక్కటే కట్టారు!

- అసంపూర్తిగా అంగన్‌వాడీ నిర్మాణాలు
- అయిదేళ్ల వైకాపా పాలనలో 'నాడు - నేడు' పనుల తీరు

➡ ఈ చిత్రంలో కనిపిస్తోంది...సుమారు రూ.13.5 లక్షల అంచనా వ్యయంతో ఏడాదిన్నర కిందట నిర్మాణం చేపట్టిన పెనుమంట్ర అంగన్‌వాడీ కేంద్రం- 3 భవనం ఇది. గతేడాది జూన్ 20న అప్పటి కలెక్టర్ ప్రశాంతి నిర్మాణ తీరును చూసి స్థానిక అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసినా ఫలితం లేకపోయింది. చివరకు ప్లాస్టింగ్ చేయకుండా వదిలేయడంతో అసంపూర్తిగా దర్శనమిస్తోంది. ఇక్కడి కేంద్రాన్ని ప్రస్తుతానికి సామాజిక భవనంలో నిర్వహిస్తున్నారు. ఇదొక్కటే కాదు.. జిల్లాలో చాలా చోట్ల ఇదే పరిస్థితి.



జిల్లాలో ఇలా...

ఐసీడీఎస్ ప్రాజెక్టులు	7
అంగన్‌వాడీ కేంద్రాలు	1556
మినీ కేంద్రాలు	70
సొంత భవనాలు	592
అద్దె భవనాల్లో ఉన్నవి	627
అద్దె లేకుండా నడిచేవి	407
నెలకు చెల్లించాల్సిన అద్దె	రూ.15 లక్షలు
నాడు-నేడులో మంజూరైన భవనాలు	61

పెనుగొండ, మార్టేరు, న్యూస్‌టుడే

వైకాపా అయిదేళ్ల పాలనలో అంగన్‌వాడీ కేంద్రాలు సమస్యలకు చిరునామాగా మారిపోయాయి. 'నాడు - నేడు' పథకంలో సొంత భవనాలు సమకూరుస్తామంటూ గొప్పలు చెప్పి, చివరకు మొండి గోడలు పునాదులతో వదిలేశారు. జిల్లాలో 61 భవనాల నిర్మాణం చేపట్టగా కేవలం ఒకటి పూర్తయ్యింది. బిల్లుల చెల్లింపులో జాప్యం, నిధుల కొరతతో మిగిలినవి వివిధ దశల్లో నిల్చిపోయాయి. ఈ నిర్మాణ ప్రాంతాల్లో పిచ్చిమొక్కలు పెరగడంతోపాటు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. కొన్ని చోట్ల నిర్మాణాలు సైతం పాడవుతున్నాయి.

అద్దె భవనాల్లో ఉక్కిరిబిక్కిరి..

సొంత భవనాలు సమకూరకపోవడంతో జిల్లాలో అత్యధిక కేంద్రాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. చాలీచాలని గదులు, రేకులషెడ్లు, పాత భవనాల్లో అరకొర వసతుల మధ్య చిన్నారులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఈ క్రమంలోనే తమ చిన్నారులను కేంద్రాలకు పంపేందుకు తల్లిదండ్రులు ఇష్టపడటం లేదు. దీంతో కేంద్రాలకు వచ్చే చిన్నారుల సంఖ్య తగ్గుతోంది. గత ప్రభుత్వం అద్దె సొమ్ము సైతం సకాలంలో విడుదల చేయకపోవడంతో నిర్వాహకులు పడరాని పాట్లు పడ్డారు. అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం అసంపూర్తి నిర్మాణాలు, అద్దె భవనాల సమాచారం కోరడంతో తమ కష్టాలు తీరతాయని సిబ్బంది ఆశతో ఉన్నారు.

నెలకు రూ. 6 వేలు చెల్లించినా..

పట్టణాల్లో రూ.6 వేలు, గ్రామాల్లో రూ.2 వేలు చొప్పున అద్దె చెల్లిస్తున్నా.. ఆ మొత్తానికి గ్రామాల్లో పూర్తి సౌకర్యాలతో భవనాలు దొరకడం కష్టంగా మారింది. ఇచ్చే ఆ మొత్తంలో ఒక గదిని తీసుకుని అందులో సరకులు, వంట సామగ్రి, రిజిస్టర్లు వంటివి ఉంచి వరండాలో పిల్లలకు పాఠాలు చెబుతున్నారు. వర్షాల పడిన సందర్భంలో కొన్నిచోట్ల కేంద్రాలు నిర్వహించలేని పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. ఈ పరిస్థితిపై ఐసీడీఎస్ పీడీ సుజాతరాణి మాట్లాడుతూ గతంలో మంజూరైన భవనాల నిర్మాణ ప్రగతిపై ప్రభుత్వానికి నివేదించామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వినాయకుడి కిరీటం అపహరణ

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: వినాయకుడి విగ్రహంలో వెండి కిరీటం అపహరణకు గురైన ఘటన వేల్పూరులో చోటుచేసుకుంది. గ్రామంలోని విఘ్నేశ్వర ఆలయంలో విగ్రహానికి ఉన్న 500 గ్రాముల వెండి కిరీటాన్ని మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. అదే గ్రామానికి చెందిన హరి వెంకట రాజారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మూర్తి తెలిపారు.

ద్వారకాతిరుమల సర్పంచి తొలగింపు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారన్న కారణంతో ద్వారకాతిరుమల పంచాయతీ సర్పంచి కుంటం స్వర్ణలతను పదవి నుంచి తొలగిస్తూ కలెక్టర్ వెట్రి సెల్వి ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీ నిధులు రూ.53,57,376 స్వాహా చేశారని వచ్చిన ఆరోపణలపై అధికారులు విచారణ చేసి నిగ్గుతేల్చారు. అక్రమం రుజువు కావడంతో సస్పెన్షన్ నిర్ణయం తీసుకున్నారు. ఉప సర్పంచిగా ఉన్న బొండాడ సావిత్రిని సర్పంచిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే 15 రోజుల లోపు దుర్వినియోగం అయిన సొమ్మును స్వర్ణలత నుంచి రికవరీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా) (కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 140, 149, 160 చికెన్ విత్ స్కిన్ - 270 చికెన్ స్కిన్‌లెస్ - 280.

పోలీసులకు చిక్కిన అంతర జిల్లాల కేటుగాళ్లు



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌ఛార్జి డీఎస్పీ రమేష్‌బాబు

కడియం, న్యూస్‌టుడే: తూర్పుగోదావరి జిల్లా కడియం మండలంలోని కడియపులంక గ్రామంలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన చోరీ ఉదంతాన్ని పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. ఇన్‌ఛార్జి డీఎస్పీ కె.రమేష్‌బాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జూన్ 18 2024న రాత్రి కడియపులంక గ్రామానికి చెందిన కర్రి వెంకటేశ్వరరావు నివాసంలో చోరీ జరిగింది. ఈఘటనలో 108 గ్రాముల బంగారు ఆభరణాలు, మూడు కేజీల వెండి వస్తువులు లాకరులో ఉంచిన రూ1.08 లక్షల నగదు గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి చోరీ చేసినట్లు బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బుధవారం ఉదయం కడియం సీఐ వెంకటేశ్వరరావు, రాజమహేంద్రవరం సీసీఎస్ సీఐ వై.రాంబాబు సిబ్బందితో కలసి కడియపులంకలో చాకలి రేవుదగ్గర అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా గుంటూరు జిల్లా తెనాలి మండలం నందివెలుగు గ్రామానికి చెందిన పిల్లి సురేష్ అలియాస్ శివ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం తాతపూడి గ్రామానికి చెందిన కాండ్రేగుల శ్రావణకృష్ణ అలియాస్ శ్రవణ్‌లుగా గుర్తించారు. దర్యాప్తులో వీరిరువురూ అనేక నేరాలకు పాల్పడినట్లు రుజువైంది. వీరి చేసిన చోరీలకు సంబంధించి వెండి, బంగారు వస్తువులను మూడో వ్యక్తిగా ఉన్న అనపర్తి మండలం కుతుకులూరు గ్రామానికి చెందిన పోతంశెట్టి గోపాలకృష్ణ అలియాస్ రెడ్డి వద్ద దాచేవారు. పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండలో రెండు చోరీలు, ప్రకాశం జిల్లా దర్శి, బాపట్ల జిల్లా చందోలులో ఒక్కొక్కటి చొప్పున చోరీలకు పాల్పడినట్లు విచారణలో నేరాన్ని అంగీకరించారు. కడియం పోలీసు స్టేషన్ పరిధిలో చోరీకి గురైన వస్తువులతోపాటు పెనుగొండ, దర్శి తదితర ప్రాంతాలలో చోరీ చేసిన బంగారు వస్తువులు 16.738 కాసులు(129 గ్రాములు), 7.8 కేజీల వెండి వస్తువులను వీరి నుంచి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రిమాండుకు తరలించామని డీఎస్పీ తెలిపారు.

డీజేలు నిషేధించాలంటూ కేసు

కలెక్టర్, ఎస్పీలకు న్యాయస్థానం నోటీసులు

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: డీజే శబ్దాల మోతను నిషేధించాలంటూ సీనియర్ న్యాయవాది భీమేశ్వరరావు కేసు దాఖలు చేశారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కోర్టులో దాఖలైన వాజ్యాన్ని న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి రత్నప్రసాద్ విచారించారు. ప్రతివాదులైన ఏలూరు కలెక్టర్, ఎస్పీ, జిల్లా పంచాయతీ, పౌరసంబంధాల అధికారులు, ఏలూరు కమిషనర్‌కు నోటీసులు జారీ చేశారు. ఈ నెల 21న జిల్లా న్యాయసేవాధికారి సంస్థ అథారిటీ న్యాయస్థానంలో హాజరుకావాలని ఆదేశించారు.

గోదావరిలో ఇంజినీరింగ్ విద్యార్థి గల్లంతు

ఇక్కడే ఏడాది కిందట నలుగురి మృతి

తాళ్లరేవు, న్యూస్‌టుడే: విహారయాత్ర ఆ విద్యార్థుల్లో విషాదం నింపింది. రాజమహేంద్రవరానికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి కుతాని సాయిచంద్ర(21) గోపులంక పుష్కరరేవులో బుధవారం స్నానానికి దిగి గల్లంతయ్యాడు. తమ కళ్ల ఎదుటే స్నేహితుడు నీటిలో మునిగిపోవడంతో మిగిలిన ఆరుగురు ఆ విషాదం నుంచి తేరుకోలేకపోతున్నారు. ఇదే ప్రాంతంలో ఏడాది కిందట నలుగురు మృతి చెందడం గమనార్హం. కోరింగ ఎస్సై పి.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. తణుకులోని ఇంజినీరింగ్ కళాశాలలో అఖరి సంవత్సరం చదువుతున్న ఏడుగురు విద్యార్థులు బుధవారం కారులో యానాం విహారయాత్రకు వెళ్లారు. ఇందులో రాజమహేంద్రవరానికి చెందిన కుతాని సాయిచంద్ర, రవ్వా మంజుల్, వేంపాటి సంతోష్, నిఖిల్, తణుకుకు చెందిన మండా వంశీ, కార్తీక్, తాడేపల్లిగూడేనికి చెందిన శివరామ్ ఉన్నారు. మధ్యాహ్నం యానాం నుంచి తిరిగి వస్తూ తాళ్లరేవు మండలం ఇంజరం పంచాయతీ గోపులంక వద్ద గోదావరి పుష్కర రేవు వద్ద ఆగారు. గోదావరిలో స్నానం చేసేందుకు దిగారు. కొద్దిసేపటి తర్వాత సాయిచంద్ర స్నేహితుల కళ్లెదుటే నీటిలో మునిగి గల్లంతయ్యాడు. మిత్రుడిని రక్షించే ప్రయత్నం చేసిన ఫలితం లేకుండా పోయిందని మిగిలిన ఆరుగురు యువకులు కన్నీటిపర్యంతమయ్యారు. ఆ విద్యార్థికి ఈత రాకపోకవడంతో మునిగిపోయినట్లు భావిస్తున్నారు. ఆ ప్రాంతంలో లోతు ఎక్కువగా ఉండటం, మేట వేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. గల్లంతైన విద్యార్థి కోసం జాలర్లు పడవలపై జాల్లర్లు గాలించారు. గత ఏడాది అక్టోబరు 21న ఇదే ప్రాంతంలో స్నానానికి దిగి తణుకు ప్రాంతానికి చెందిన నలుగురు విద్యార్థులు మృతి చెందారు.

భీమవరం
•భీమవరం •ఉండి

వసతి గృహాల్లో సదుపాయాలపై ఆరా


విద్యార్థులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి ధనరాజు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని పలు వసతి గృహాలను భీమవరం రెండో అదనపు జ్యుడీషియల్ మొదటి తరగతి మెజిస్ట్రేట్ డి.ధనరాజు బుధవారం పరిశీలించారు. మెంటేవారితోట రోడ్డులోని బీసీ బాలుర, శివరావుపేటలో ఎస్సీ బాలుర వసతి గృహాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. మౌలిక వసతులు, ఆహారం నాణ్యతపై ఆరా తీశారు.

రేపటి నుంచి రీ-సర్వే గ్రామ సభలు

ఆకివీడు, పాలకోడేరు, న్యూస్‌టుడే: గతంలో రీ-సర్వే పూర్తయిన పంచాయతీల్లో ఈ నెల 18 నుంచి గ్రామ సభలను నిర్వహించనున్నట్లు ఆకివీడు, పాలకోడేరు తహసీల్దార్లు ఎస్.వెంకటేశ్వరరావు, ఎస్‌వీ విజయలక్ష్మి తెలిపారు. ఈ రీ-సర్వే ప్రక్రియలో ఎదురైన సమస్యలను రైతులు, భూ యజమానులు ఈ సభల్లో తెలియజేయవచ్చన్నారు. ★ ఆకివీడు మండల పరిధిలో 18న అజ్జమూరు, 19న తరటావ, 22న సిద్ధాపురం, 24న కోళ్లపర్రు, 26న చినకాపవరం, 29న కుప్పనపూడి, 30న చెరుకుమిల్లి గ్రామ సచివాలయాల వద్ద సభలు నిర్వహిస్తారు. ★ పాలకోడేరు మండల పరిధిలో 18న కుందేపూడి, వేండ్ర అగ్రహారం, 19న గొరగనమూడి, 22న పెన్నాడ అగ్రహారం, 23న విస్సాకోడేరు, 24న వేండ్ర, 25న గరగపర్రు, 26న గొల్లలకోడేరు, 29న కోరుకొల్లు, 30న మోగల్లు, నవంబరు 2న పాలకోడేరు గ్రామాల్లో సభలు జరుగుతాయి.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

భీమవరం పట్టణం	:80085 74471	వీరవాసరం	:80085 74475
భీమవరం మండలం	:80085 74533	ఉండి	:80085 74526
ఆకివీడు	:80085 74525	పాలకోడేరు	:80085 74467
కాళ్ల	: 80085 74474		

ఆదాయమంటే చేదా..?

శిథిలావస్థలో పురపాలక వాణిజ్య సముదాయాలు

భయం గుప్పెట్లో..

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం పురపాలక సంఘానికి చెందిన కొన్ని వాణిజ్య సముదాయాలు శిథిలావస్థకు చేరాయి. ఏళ్ల తరబడి నిర్వహణ, మరమ్మతుల ఊసే లేకపోవడంతో కూలేట్లుగా మారాయి. కొన్ని చోట్ల మెట్లు అనువుగా లేకపోవడంతో ఏళ్ల తరబడి దుకాణాలు ఖాళీగా ఉన్నాయి. వ్యాపారాల నిమిత్తం పట్టణంలో చిన్న గది కావాలన్నా భారీ స్థాయిలో అద్దె, అడ్వాన్సు చెల్లించాలి. ప్రధాన రహదారుల పక్కనే ఉన్న పురపాలక సముదాయాలు మాత్రం రంగుల్లే కుండా, గోడలు పెచ్చులూడుతూ కళావిహీనంగా కనిపిస్తున్నాయి. వీటిని ఆధునికీకరిస్తే ప్రతినెలా రూ.లక్షల ఆదాయం వచ్చే అవకాశం ఉన్నా అధికారులు ఈ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు.


షాపింగ్ కాంప్లెక్సుల ఆవరణ

పురపాలక వ్యాపార సముదాయాల నిర్వహణ పట్టించుకునే నాథుడే లేకపోవడంతో వాటి ఆవరణలు చెత్తతో నిండి ఉన్నాయి. ఎంతో విలువైన ప్రాంతాల్లో, ముఖ్యకూడళ్లలో ఉన్న గదుల నుంచి ప్రస్తుతం ఏడాదికి రూ.1.20 లక్షల ఆదాయం మాత్రమే వస్తోంది. మరికొన్ని గదులను ఖాళీగా వదిలేయడంతో ముందు భాగాలు ఆక్రమణలతో నిండిపోయాయి. పట్టణంలో ప్రధాన వ్యాపార కూడళ్లయిన బుధవారం మార్కెట్, పాతబస్టాండ్ ప్రాంతాల్లో భవనాల గోడలు గతంలో కూలిపోయి త్రుటిలో పెను ప్రమాదాలు తప్పాయి. ఇలాంటి భవనాల్లోనే బిక్కుబిక్కుమంటూ


మూతబడిన దుకాణాలు

వ్యాపారులు నిర్వహించాల్సి వస్తోందని దుకాణదారులు వాపోతున్నారు. బుధవారం మార్కెట్ కూడలి వద్ద సముదాయంలో మూడు గదులను గతంలో సచివాలయాలకు కేటాయించారు. వాటిలోకి వెళ్లాలంటే చెత్త, అవరోధాలను దాటాల్సిందే. ఖాళీగా ఉన్న దుకాణాలను గుర్తించి వేలం నిర్వహిస్తామని రెవెన్యూ అధికారి పీవీ రంగారావు చెప్పారు. శిథిలమైన భవనాలకు మరమ్మతులు చేసి రంగులు వేసేందుకు టెండర్ల ప్రక్రియ నిర్వహిస్తామని ఎంఈ పి.త్రినాథరావు చెప్పారు. శిథిలావస్థకు చేరిన భవనాల స్థానంలో కొత్త నిర్మాణాలకు చర్యలు తీసుకుంటామన్నారు.

పట్టణంలో ఇలా..	పురపాలక దుకాణ సముదాయాలు 8	మొత్తం గదులు 154	ఖాళీగా ఉన్నవి 25


కోళ్లపర్రు వంతెన వద్ద యంత్రంతో గుర్రపుడెక్క తొలగింపు

తొలగిన అవరోధాలు

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు మండల పరిధిలో 12 కిలోమీటర్ల మేర విస్తరించిన చినకాపవరం మురుగు కాలువ ప్రక్షాళన పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. కోళ్లపర్రు వంతెన వద్ద భారీగా మేటవేసిన గుర్రపుడెక్కను బుధవారం పొక్లెయిన్‌తో తొలగించారు. ఈ కాలువ దుస్థితిపై 'అవరోధాలతో కలవరం' శీర్షికతో ఈ నెల 14న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పనులను వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని ఇన్‌ఛార్జి ఏఈ ఫణిశంకర్ తెలిపారు.

వ్యర్థాల తొలగింపు

స్పందనకు వందనం

ఉండి, న్యూస్‌టుడే: ఉండి- భీమవరం మధ్య 165 జాతీయ రహదారి అంచుల్లో మట్టి, వ్యర్థాలు పేరుకుపోయిన తీరుపై 'ఈనాడు- మేమున్నాం.. మీకు తోడుగా'లో సెప్టెంబరులో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. వ్యరాథల తొలగింపు పనులను ఇటీవల చేపట్టి పూర్తి చేశారు.

నేత్రపర్వంగా వేంకన్న కల్యాణం



కాళ్ల, న్యూస్‌టుడే: కాళ్లకూరు క్షేత్రంలో వేంకటేశ్వరస్వామి ఆశ్వయుజమాస లఘు కల్యాణోత్సవం బుధవారం నేత్రపర్వంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి వేదపండితుడు ఎ.ఫణికుమార్‌శర్మ పర్యవేక్షణలో అర్చకులు కల్యాణం నిర్వహించారు.

నేటి నుంచి మావుళ్లమ్మ మండల దీక్షలు



భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: ఆశ్వయుజ శుద్ధ పౌర్ణమి సందర్భంగా భీమవరం ఇలవేల్పు మావుళ్లమ్మ మండల దీక్షలను గురువారం ఉదయం 4.30 గంటలకు మాలధారణలతో ప్రారంభించనున్నట్లు దేవస్థానం సహాయ కమిషనర్ బీఎం నగేశ్ బుధవారం తెలిపారు. మండల దీక్ష స్వీకరించే భక్తులకు ప్రధానార్చకుడు మద్దిరాల మల్లికార్జునశర్మ అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేసి మాలధారణ చేస్తారన్నారు. నవంబరు 27న దీక్ష విరమణ, పూర్ణాహుతి వేడుక నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నాంచారమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

ఉండి, న్యూస్‌టుడే: ఉండిలో దేవుడి గుడి వీధిలో నిర్మించిన ఆలయంలో నాంచారమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. తొలుత గ్రామోత్సవం, మండపారాధన, విశ్వశాంతి హోమాలు, పంచామృత కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. దాతల సహకారంతో నూతన ఆలయాన్ని నిర్మించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

వైభవంగా అమ్మవారి ఊరేగింపు

ఆకివీడు, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా మాదివాడలో గంగానమ్మ- మద్దిరావమ్మ గ్రామోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక వాహనంపై అమ్మవారి ప్రతిమను కొలువుదీర్చి మేళతాళాలు, కళాకారుల నృత్యాలతో ఊరేగించారు. ఆలయ కమిటీ సభ్యులు, గంగానమ్మ-మద్దిరావమ్మ యూత్ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


అలంకరణలో గంగానమ్మ-మద్దిరావమ్మ

ప్రాధాన్యక్రమంలో అభివృద్ధి పనులు

మత్స్యపురి (వీరవాసరం), న్యూస్‌టుడే: నియోజకవర్గంలో ప్రాధాన్యక్రమంలో అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు స్పష్టం చేశారు. 'పల్లె పండగ - పంచాయతీ వారోత్సవాలు' కార్యక్రమంలో భాగంగా మత్స్యపురిలో రూ. 37 లక్షలతో చేపట్టిన సీసీ రహదారుల నిర్మాణాలకు ఎమ్మెల్యే బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీయే సర్కారు అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే పెద్ద ఎత్తున అభివృద్ధి పనులకు నిధులు కేటాయించడం అభినందనీయమన్నారు. వైకాపా పాలనలో గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు. ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని, సర్పంచి కారేపల్లి శాంతిప్రియ, ఉప సర్పంచి జవ్వాది ఉదయ భాస్కరరావు, మాజీ సర్పంచి పిప్పళ్ళ నాగవెంకటశ్రీరాం (నాని), తెదేపా నాయకుడు చింతా కనకయ్య, జనసేన, భాజపా మండల అధ్యక్షులు జవ్వాది బాలాజీ, కోడి నరసింహం తదితరులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

నేడు భీమవరం మండలంలో..

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: పల్లె పండుగ కార్యక్రమాన్ని భీమవరం మండలం గొల్లవానితిప్ప, గూట్లపాడు గ్రామాల్లో గురువారం ఉదయం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది తెలిపారు.

ముగిసిన తపాలా వారోత్సవాలు

గునుపూడి, న్యూస్‌టుడే: తపాలాశాఖ సేవలు, పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పురపాలక కమిషనర్ కె. రామచంద్రరెడ్డి అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక, తపాలాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన తపాలా వారోత్సవాల ముగింపు వేడుక బుధవారం జరిగింది. ఈ సందర్భంగా నలుగురు ఉద్యోగులు, 12 మంది పోస్టుమెన్లను సత్కరించారు. వివిధ పోటీల్లో విజేతలైన 31 మంది విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందించారు.


సన్మాన గ్రహీతలు, బహుమతులు అందుకున్న విద్యార్థులతో అతిథులు

సామాన్యులపై ధరల భారం


మాట్లాడుతున్న సీతారాం

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: నిత్యావసర సరకుల ధరలు పెరుగుదల సామాన్యులకు భారంగా మారిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మంతెన సీతారాం అన్నారు. భీమవరంలోని సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంతెన సీతారాం మాట్లాడుతూ ధరల నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడంలేదని విమర్శించారు. సీనియర్ నాయకుడు బి. బలరాం మాట్లాడుతూ భారీ వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఆదుకోవాలని కోరారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు జేఎన్‌వీ గోపాలన్, నాయకులు చింతకాయల బాబూరావు, కేతా గోపాలన్, కర్రి నాగేశ్వరరావు, కవురు పెద్దిరాజు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

వెంప (భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే: భీమవరం మండలం వెంపలో సీపీఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ధరలు తగ్గించడంతో పాటు పౌర సరఫరాల వ్యవస్థ ద్వారా 14 రకాల సరకులు అందించాలని నినాదాలు చేశారు.

ఎమ్మెల్సీ అభ్యర్థికి సంఘీభావం

కాళ్ల, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి బొర్రా గోపీమూర్తికి మద్దతుగా కోపల్లె ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం యూటీఎఫ్ నాయకులు సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయుల సంక్షేమానికి చేస్తున్న పోరాటాలు, అందిస్తున్న సేవలను వివరించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు సంఘీభావం తెలిపినట్లు వెల్లడించారు.

విశ్రాంత ఈఈ నేత్రదానం

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన ఆర్‌అండ్‌బీ విశ్రాంత ఈఈ పైడిమర్రి వెంకట సత్యనారాయణ బుధవారం మరణించగా నేత్రదానానికి కుటుంబ సభ్యులు అంగీకరించారు. వాసవీక్లబ్ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఎల్‌వీ ప్రసాద్ ఐ బ్యాంకు (నిడదవోలు) నుంచి సిబ్బంది వచ్చి ఆయన కార్నియాలను సేకరించారు.


గోడ పత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

రేపు ఇఫ్టూ రాష్ట్ర సదస్సు

ఆకివీడు, న్యూస్‌టుడే: విజయవాడలో ఈ నెల 18న నిర్వహించే ఇఫ్టూ రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.రామ్మోహన్ పిలుపునిచ్చారు. ఆకివీడులో సంఘం మండల కార్యదర్శి తోట రామకృష్ణ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులు, చట్టాలను కాలరాస్తున్నాయని విమర్శించారు. అనంతరం సదస్సు గోడపత్రాలను ఆవిష్కరించారు.

బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అంతర కళాశాలల బ్యాడ్మింటన్ పోటీలు భీమవరం డీఎన్నార్ కళాశాల ఆవరణలో బుధవారం ప్రారంభమయ్యాయి. పోటీలను కరస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు, ఉపాధ్యక్షుడు జీవీ పాండురంగరాజు, ప్రధానాచార్యుడు జి.మోజెస్ ప్రారంభించారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు చెన్నైలోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జరిగే సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొంటారని పర్యవేక్షకులు తెలిపారు.

మత్స్య సహాయకులకు నేడు శిక్షణ

ఉండి, న్యూస్‌టుడే: గ్రామీణ మత్స్య సహాయకులకు శిక్షణ తరగతులను గురువారం నిర్వహిస్తున్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త ఎన్.మల్లికార్జునరావు తెలిపారు. చేపలు, రొయ్యల్లో వచ్చే వ్యాధులు, యాజమాన్య పద్ధతులపై నిర్వహించే ఈ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

భీమవరం సినిమాలు

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే

శ్రీపద్మాలయ స్క్రీన్ 1	వేట్టయన్
శ్రీపద్మాలయ స్క్రీన్ 2	దేవర
కిషోర్ స్క్రీన్ 1	విశ్వం
కిషోర్ స్క్రీన్ 2	జిగ్రా
నటరాజ్	జనక అయితే గనక
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 1	వేట్టయన్
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 2	విశ్వం
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 3	శ్వాగ్
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 4	దేవర
విజయలక్ష్మి స్క్రీన్ 1	మార్టిన్
మహాలక్ష్మి స్క్రీన్ 2	మా నాన్న సూపర్ హీరో

అడుగడుగునా గండాలే..!

I◆ ఆకివీడు మండలం చెరుకుమిల్లి గ్రామానికి చెందిన యువకుడు చెట్టేబత్తుల ఆనంద్‌బాబు గణపవరంలో చేపల ప్యాకింగ్ పని చేస్తుంటారు. ఆయన గత శుక్రవారం ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా గుమ్ములూరు రోడ్డులో కోళ్లపర్రు వద్ద రహదారి గుంతలో పడిపోయారు. నుదిటి భాగంలో తీవ్రగాయం కాగా ముక్కు చిట్లిపోయింది. రెండు పళ్లు విరిగిపోయాయి. భీమవరంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స అనంతరం ఆయన బుధవారం ఇంటికి చేరారు. ఇలాంటి బాధితులు మరెందరో ఉన్నారు.


కోళ్లపర్రు వద్ద వాహనచోదకుల అవస్థలు

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు నుంచి కోళ్లపర్రు, తరటావ, గుమ్ములూరు, చినకాపవరం, పెదకాపవరం వరకు 12 కిలోమీటర్ల మేర ఉన్న ఆర్‌అండ్‌బీ రహదారిపై పలు చోట్ల భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఈ రహదారిని రెండేళ్ల క్రితం అభివృద్ధి చేశారు. ఆకివీడులో గుమ్ములూరు కూడలి వద్ద జాతీయ రహదారి నుంచి గుమ్ములూరు రోడ్డు మలుపులో అడుగులోతు గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల వర్షాలకు కోళ్లపర్రు, గుమ్ములూరు తదితర గ్రామాల్లోనూ ఈ రోడ్డు ఛిద్రమైంది. వర్షం కురిసినప్పుడు గుంతల్లో నీరు నిలిచిపోవడంతో వాటి లోతు అంచనా తెలియక రాత్రి వేళ వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ సమస్యను ఆర్‌అండ్‌బీ ఏఈ కె.శ్రీహరిరాజు దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లగా గుంతలు పూడ్చించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.


గుమ్ములూరు కూడలిలో గోతులు

మద్యం తాగిన చోదకుడికి జరిమానా

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: మద్యం తాగి వాహనం నడుపుతూ ఈ నెల 3న పోలీసులకు పట్టుబడిన టీఎన్ రామాంజనేయులుకు రూ. 10 వేల జరిమానా విధిస్తూ భీమవరం స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ తీర్పు చెప్పారని సీఐ జి.కాళీచరణ్ బుధవారం తెలిపారు. బహిరంగంగా మద్యం తాగినా, తాగి వాహనాలు నడిపినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

చరవాణుల అప్పగింత

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: భీమవరం రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో గతంలో చోరీకి గురైన అయిదు చరవాణులను ఇటీవల పోలీసులు రికవరీ చేశారు. వీటిని బుధవారం బాధితులకు అప్పగించారు. ప్రత్యేక యాప్ ద్వారా ఈ చరవాణులను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

చోరీ సొత్తు కొనుగోలుపై తనిఖీలు

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడులో జాతీయ రహదారి పక్కన ప్రధాన కూడలి సమీపాన ఉన్న ఆభరణాల దుకాణంలో పోలీసులు బుధవారం రాత్రి తనిఖీలు చేశారు. చోరీ కేసులో నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు కైకలూరు పోలీసులు ఇక్కడికి వచ్చి దుకాణ యజమానిని విచారించారు. అనంతరం చోరీ సొత్తును రికవరీ చేసి తీసుకెళ్లినట్లు సమాచారం. కొద్ది రోజుల క్రితం ఇదే దుకాణ యజమాని నుంచి ఏలూరు పోలీసులు చోరీ సొత్తును రికవరీ చేశారు.

ఉపాధి నిధులతో కాలువల ప్రక్షాళన

కోలమూరు (ఉండి), న్యూస్‌టుడే: రైతులకు ఉపయోగపడే పంట, మురుగు బోదెల ప్రక్షాళన పనులకు ప్రతిపాదనలు తయారుచేసి అందించాలని నరేగా సాంకేతిక సహాయకుడు ఒమేగారాజు సూచించారు. కోలమూరులో ఉపసర్పంచి నడింపల్లి రామకృష్ణంరాజు అధ్యక్షతన బుధవారం జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. తెదేపా సమన్వయ కమిటీ సభ్యుడు పేరిచర్ల బాలరాజు మాట్లాడుతూ గ్రామంలో రూ.18 లక్షల విలువైన 35 పనులను ప్రతిపాదించినట్లు తెలిపారు.

పోటెత్తిన కడలి

మొగల్తూరు, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో బుధవారం కడలి పోటెత్తింది. సాధారణంగా అమావాస్య తర్వాత, పౌర్ణమికి ముందు సముద్ర పోటు ఎక్కువగా ఉంటుంది. దీనికి తోడు అల్పపీడన ప్రభావంతో సముద్రఅలలు ఉద్ధృతంగా మారాయి. పేరుపాలెంసౌత్, కేపీపాలెంసౌత్‌లలో సముద్ర అలలు సుమారు 50 మీటర్ల వరకూ భూభాగంపైకి పోటెత్తాయి. సముద్రపోటు ప్రభావంతో ఉప్పుటేరులు, మురుగు కాలువలు కూడా ఉద్ధృతంగా మారాయి. మొగల్తూరు, నరసాపురం మండలాల్లోని తీర గ్రామాల్లో ఆక్వాచెరువులు ముంపుబారిన పడ్డాయని రైతులు తెలిపారు.

తేలిపోతున్న నాణ్యత!

వీరవాసరం, న్యూస్‌టుడే: రహదారి మరమ్మతుల్లో నాణ్యతా ప్రమాణాలు తేలిపోతున్నాయి. భీమవరం- పాలకొల్లు మధ్య 165వ నంబరు జాతీయ రహదారికి ఆగస్టులో మరమ్మతులు చేశారు. రెండు నెలలు పూర్తయ్యేసరికి పలుచోట్ల ఈ రహదారి పగుళ్లు తీసి మళ్లీ గుంతలు ఏర్పడ్డాయి. తాజాగా అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు మరిన్ని చోట్ల రహదారి దెబ్బతినే అవకాశాలున్నాయి.


వీరవాసరం తూర్పు చెరువు కూడలి వద్ద దెబ్బతింటున్న జాతీయ రహదారి

ప్రతిపాదనల్లోనే ఆగిన పునర్నిర్మాణం

మురుగు పారుదలకు తీవ్ర అవరోధాలు

ఉండి, న్యూస్‌టుడే: ఉండిలో జలవనరుల శాఖ కార్యాలయానికి సమీపాన బొండాడ మేజర్ డ్రెయిన్, ఉండి ప్రధాన పంట కాలువ కలిసే ప్రాంతంలో ఆంగ్లేయుల కాలంలో నిర్మించిన అక్విడక్టు రెండు దశాబ్దాల కిందటే శిథిలావస్థకు చేరింది. గణపవరం, పాలకోడేరు మండలాల్లో ఏడెనిమిది గ్రామాలతో పాటు ఉండి మండలంలో వ్యవసాయ, ఆక్వా చెరువుల్లో మురుగు వివిధ కాలువల ద్వారా బొండాడ మేజర్ డ్రెయిన్‌లో కలుస్తుంది. ఈ అక్విడక్టు ఎగువ, దిగువ ప్రాంతాల్లో మట్టి, ఇతర వ్యర్థాలు మేట వేయడంతో నీరు దిగువకు వెళ్లడం లేదు. ఈ కట్టడాన్ని గతంలో ఇంజినీరింగ్ ఉన్నతాధికారులు పరిశీలించి ఆరు టన్నులకు మించి బరువుండే వాహనాల రాకపోకలను నిషేధించారు.


బొండాడ డ్రెయిన్ వైపు ప్రమాదకరంగా కాలిబాట

డెల్టా ఆధునికీకరణలో భాగంగా ఇక్కడ అక్విడక్టు పునర్నిర్మాణానికి 2009 ఫిబ్రవరి 14న నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ పనికి రూ.3.85 కోట్లు అవసరమని నాడు అంచనా వేశారు. పనులు మాత్రం పట్టాలెక్కలేదు.

★ ఖానాల సామర్థ్యం పెంపు, డిజైన్ మార్పు పేరిట గతంలో కాలయాపన చేశారని, వైకాపా హయాంలో కనీసం పట్టించుకోలేదని అన్నదాతలు వాపోతున్నారు. అధిక వర్షాలు కురిస్తే దీని పరిధిలో వేలాది ఎకరాల్లో పల్లపు చేలు ముంపుబారిన పడుతున్నాయి. ఈ అంశంపై జలవనరులశాఖ డీఈఈ సత్యనారాయణమూర్తి 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ ఆ ప్రాంతాన్ని పరిశీలించి ప్రస్తుత పరిస్థితిపై ఉన్నతాధికారులకు నివేదిస్తానని తెలిపారు.


ఉండి నియోజకవర్గంలోనే కీలకమైన అక్విడక్టు ఇది. కొన్నేళ్ల కిందటే శిథిలావస్థకు చేరింది. రెయిలింగ్స్ విరిగిపోయాయి. గత ప్రభుత్వ హయాంలో కనీసం మరమ్మతులకు కూడా నోచుకోక ప్రమాదకరంగా మారింది.

నరసాపురం

• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

విద్యార్థులు పరిస్థితులకు అనుగుణంగా మెలగాలి

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యార్థులు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మెలగాలని కాకినాడ రీజినల్ జాయింట్ డైరెక్టర్, పశ్చిమగోదావరి జిల్లా విద్యాశాఖాధికారి జి.నాగమణి అన్నారు. పాలకొల్లు మండలం లంకలకోడేరు జడ్పీ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలను సాధించాలన్నారు. అటల్ ల్యాబ్‌ను సందర్శించారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు గుర్తింపు కార్డులను అందించారు.


మాట్లాడుతున్న నాగమణి

నేటి నుంచి మావుళ్లమ్మ మండల దీక్షలు

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: ఆశ్వయుజ శుద్ధ పౌర్ణమి సందర్భంగా భీమవరం ఇలవేల్పు మావుళ్లమ్మ మండల దీక్షలను గురువారం ఉదయం 4.30 గంటలకు మాలధారణలతో ప్రారంభించనున్నట్లు దేవస్థానం సహాయ కమిషనర్ బీఎం నగేశ్ బుధవారం తెలిపారు. మండల దీక్ష స్వీకరించే భక్తులకు ప్రధానార్చకుడు మద్దిరాల మల్లికార్జునశర్మ అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేసి మాలధారణ చేస్తారన్నారు. నవంబరు 27న దీక్ష విరమణ, పూర్ణాహుతి వేడుక నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.




యలమంచిలిలో రైతులతో వ్యవసాయాధికారులు

ఎండు తెగులుతో జాగ్రత్త

యలమంచిలి, న్యూస్‌టుడే: వరిసాగులో ఎండు తెగులు విజృంభిస్తున్న తరుణంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్.దేవి అన్నారు. యలమంచిలిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల సందేహాలను ఆమె నివృత్తి చేశారు. సాగులో ఆధునికీకరణలో భాగంగా ప్రభుత్వం రాయితీపై అందించనున్న డ్రోన్లతో ఎరువులను పిచికారీ చేసుకోవడానికి అన్నదాతలు సమాయత్తం కావాలన్నారు. స్థానిక నాయకులు బొప్పన హరికిషోర్, చిలుకూరి శ్రీనివాస్, తమ్మినీడి విష్ణుమూర్తి, ఏసు, సురేశ్ పాల్గొన్నారు.

ఆధునిక యాజమాన్య పద్ధతులపై అవగాహన

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: సీతారాంపురం నార్త్‌లోని రైతు సేవా కేంద్రంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో ఎం.శామ్యుల్ జాన్సన్ మాట్లాడారు. మండల పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ సురేంద్ర, జలవనరులశాఖ ఏఈ బి.మోహనకృష్ణ, రైతులు పాల్గొన్నారు.


సోమరాజు ఇల్లింద్రపర్రులో..

గోస్తనీ ముంపు సమస్య తీర్చండి

పెనుమంట్ర, న్యూస్‌టుడే: గోస్తనీ ముంపు సమస్యకు పరిష్కారం చూపాలని పరివాహక ప్రాంత రైతులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. సోమరాజు ఇల్లింద్రపర్రు, జుత్తిగ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు గోస్తనీ డ్రెయిన్ కిక్కిస, ఇతర వ్యర్థాలతో నిండిపోవడంతో ఎదురవుతున్న ఇబ్బందులను ఏకరవు పెట్టారు.

పల్లెటూరుకు పండగొచ్చింది..!

చాలా రోజులకు గ్రామాల్లో ప్రగతి పనులు

పాలకొల్లు, న్యూస్‌టుడే:

● ఆచంట - వేమవరంలో ఎప్పటి నుంచో ఉన్న కాలనీకి సరైన రహదారి, డ్రెయిన్ వసతిగాని ఏర్పడక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. గడిచిన అయిదేళ్ల పాలనలో వైకాపా నాయకుల చుట్టూ తిరిగినా పైసా విడుదల కాలేదు. కూటమి ప్రభుత్వం పల్లెల్లోని సమస్యల పరిష్కారానికి నడుం కట్టింది. పల్లె పండగతో ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మించడానికి ఈ నెల 14న శ్రీకారం చుట్టింది. ఆయా పనుల్లో ఆచంట - వేమవరానికి నిధులు మంజూరవ్వడంతో ఏళ్ల తరబడి సమస్యకు మోక్షం కలగనుంది.

గత వైకాపా ప్రభుత్వ హయాంలో పాలకొల్లు, నరసాపురం, ఆచంట నియోజకవర్గాల్లో ప్రగతి పనులకు శంకుస్థాపనలు చేయడం తప్ప, పట్టుమని పది పనులు చేసిన పాపాన పోలేదు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నేతృత్వంలో జాతీయ ఉపాధి హామీ నిధులను ఉపయోగించి గ్రామీణ ప్రాంతాల్లోని రహదారులను మురుగు కాల్వలను అభివృద్ధి చేయడానికి ఆగస్టు నెలలో నిర్వహించిన గ్రామ సభల్లో పలు పనులను గుర్తించారు. ఆయా పనులకు ప్రస్తుతం మండలాల వారీగా శంకుస్థాపనలు జరుగుతున్నాయి.

మురుగుకు మోక్షం...

గ్రామీణ, శివారు ప్రాంతాల్లో అక్కడక్కడ సీసీ రహదారుల సమస్య ఉన్నా డ్రెయిన్ల సమస్యను తీసుకుంటే ప్రధాన కూడళ్లలోనూ కొనసాగుతుంది. ప్రస్తుతం చేపడుతున్న పనుల ద్వారా గ్రామాల్లో మురుగు సమస్యకు మోక్షం కలుగుతుందని కాజ తూర్పు ఎంపీటీసీ సభ్యుడు జిల్లెళ్ల రత్నంరాజు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రాకతో పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులతోపాటు ఉపాధి హామీలో అభివృద్ధి పనులు చేపట్టడంపై సర్వదా హర్షం వ్యక్తమవుతుంది. దీనిపై పాలకొల్లు, యలమంచిలి, పంచాయతీరాజ్ ఏఈలు వర్ధనపు శ్యాంబాబు, నాగేశ్వరరావులను 'న్యూస్‌టుడే' సంప్రదించగా శంకుస్థాపనలు పూర్తయిన వెంటనే పనులు వేగంగా పూర్తిచేస్తామని చెప్పారు.


డ్రెయిన్ లేక యలమంచిలిలో రోడ్డుపై పారుతున్న వర్షపు నీరు

మండలం	పనులు	నిధులు (రూ.కోట్లలో)	పనుల విస్తీర్ణం (కి.మీ.)
యలమంచిలి	44	5	7.5
నరసాపురం	27	3.45	6.2
ఆచంట	08	3	4.5
పాలకొల్లు	28	2.80	3.5

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే

సమస్య: సిద్ధాంతం గోదావరికి వెళ్లే రహదారి మసీదు సమీపంలో చెత్త వేస్తున్నారు. గాలికి చెత్త ఎగిరి ఆ ప్రాంతం అపరిశుభ్రంగా మారుతుంది. **- సుగుణరావు, సిద్ధాంతం**

సమాధానం: పరిశీలించి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయిస్తాం **- అచ్యుత రామకృష్ణ, ఇన్‌ఛార్జి కార్యదర్శి, సిద్ధాంతం.**

పెనుగొండ, న్యూస్‌టుడే:

సమస్య: కొఠాలపర్రులోని పలు వీధుల్లో దోమల తీవ్రత ఎక్కువగా ఉంది. **- కవురు జగన్నాథం, కొఠాలపర్రు**

సమాధానం: దోమల మందు పిచికారీ చేయిస్తాం.

- బి.వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి, కొఠాలపర్రు

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే:

సమస్య: గ్రామంలోని రామాలయం వీధిలో సీసీ డ్రెయిన్ మట్టితో నిండిపోయి మురుగు ముందుకు సాగడం లేదు.

- తిరుమాని నరసింహస్వామి, పాత నవరసపురం

సమాధానం: సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా గ్రామ కార్యదర్శికి సూచిస్తా.

- కె.నాగేంద్రకుమార్, ఈవోపీఆర్డీ, నరసాపురం.

స్పందనకు వందనం

పెనుగొండ, న్యూస్‌టుడే: చెరుకువాడ అంబేడ్కర్ కాలనీలో నాలుగు వీధి దీపాలు వెలగక రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న వైనంపై ఈ నెల 2న 'మేమున్నాం... మీకు తోడుగా..' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి పెనుగొండ సర్పంచి నక్కా శ్యామలాసోని, పంచాయతీ కార్యదర్శి టి.రత్నాకరరావు స్పందించి సిబ్బందితో వీధి దీపాలకు మరమ్మతులు చేయించారు.

పల్లె ప్రగతే లక్ష్యం

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: పల్లె ప్రగతే ప్రభుత్వ లక్ష్యమని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా చినమల్లంలో బుధవారం రూ.50 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రెయిన్లకు భూమి పూజ చేశారు. అనంతరం ఈ గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన 500 మెట్రిక్ టన్నుల గిడ్డంగిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆచంట జడ్పీటీసీ సభ్యుడు ఉప్పలపాటి సురేష్ బాబు, సర్పంచి సీహెచ్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.


చినమల్లంలో భూమి పూజ చేస్తున్న పితాని

జోరువానలో మరమ్మతులు

నరసాపురం, న్యూస్‌టుడే: జిల్లాలోని 216 జాతీయ రహదారి పలుచోట్ల మరమ్మతులకు గురైంది. గుత్తేదారు సంస్థ రహదారి నిర్వహణ పనుల్లో భాగంగా మరమ్మతులు చేపట్టింది. బుధవారం సాయంత్రం జోరు వాన కురుస్తుండగా మరమ్మతులు కొనసాగించారు. దీనిపై ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల సాధారణ రోజుల్లో మరమ్మతులు చేసి పూడ్చిన గుంతలు రెండు, మూడు రోజులకే యథావిధిగా మారుతున్నాయని ప్రజలు వాపోతున్నారు.


జాతీయ రహదారికి మరమ్మతులు చేస్తున్న కార్మికులు

మద్యం దుకాణాలు వద్దంటూ..

నరసాపురం, న్యూస్‌టుడే: విద్యాలయాల సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని కోరుతూ బుధవారం ఆర్డీవో దాసి రాజుకు విద్యార్థినులు వినతిపత్రం అందించారు. ఆ మద్యం దుకాణం వేరే ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్‌ను కలిసి తమ విద్యాసంస్థ సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయకుండా చూడాలని విద్యార్థినులు కోరారు.


ఎమ్మెల్యే నాయకర్‌కు సమస్య తెలియజేస్తున్న విద్యార్థినులు

ముత్యాలపల్లి ఇందిరమ్మకాలనీలో..మొగల్తూరు, న్యూస్‌టుడే: తమ నివాసాల సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని కోరుతూ ప్రజలు బుధవారం నిరసన ప్రదర్శన చేశారు. ముత్యాలపల్లి ఇందిరమ్మకాలనీ సమీపంలో గతంలో ప్రభుత్వ మద్యం దుకాణం నిర్వహించిన దుకాణంలో నూతన దుకాణం ఏర్పాటు చేసే ప్రయత్నం చేయగా స్థానికులు అడ్డుకున్నారు. తాము ఇప్పటికే ఆ దుకాణం ఏర్పాటుతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని, మళ్లీ ఇక్కడే ఏర్పాటుచేస్తే ఇబ్బందులు ఎదుర్కొంటామని తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆ దుకాణం వద్దే బైఠాయించారు. దీంతో గ్రామంలో దుకాణం తెరుచుకోలేదు.

వల్లూరులో.. ఆచంట, న్యూస్‌టుడే: ఆచంట మండలం వల్లూరులో ఊరికి దగ్గరలో మద్యం షాపు ఏర్పాటు చేయవద్దంటూ స్థానిక మహిళలు అడ్డుకున్నారు. వల్లూరుకు చెందిన ఎం.పెద్దిరాజుకు చెందిన దుకాణాల సముదాయంలో షాపు ఏర్పాటు చేస్తున్న సమాచారంతో బుధవారం స్థానికులు చేరి అభ్యంతరం వ్యక్తం చేసి నిరసనకు దిగారు. అక్కడ మద్యం షాపు ఏర్పాటు వల్ల మహిళలకు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతాయని మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో కూడా ఇదే ప్రాంతంలో షాపు ఏర్పాటు చేస్తుండగా అడ్డుకున్నామని తెలిపారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో సమాచారం తెలుసుకున్న ఆచంట ఎస్సై వెంకటరమణ ఘటనా స్థలానికి వెళ్లి ఆందోళన కారులకు సర్ది చెప్పారు. సమస్య సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సూచించారు.

లక్ష్యాలకు అనుగుణంగా పని చేయండి

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: సమాజంలోని పలు వర్గాల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా బ్యాంకర్లు, వ్యవసాయ, వెలుగు శాఖ అధికారులు కార్యాచరణతో ముందుకు సాగాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ అన్నవరపు నాగేంద్రప్రసాద్ తెలిపారు. మండల పరిషత్తు సమావేశ మందిరంలో బ్యాంకర్లు పలు ప్రభుత్వ శాఖల అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకంలో అర్హులైన లబ్ధిదారులకు రుణాలు మంజూరు, రైతులకు పంట రుణాలు అందజేత తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో బ్యాంకు అధికారులు, డీఆర్డీఏ అధికారి కె.శ్రీనివాస్, మొగల్తూరు ఏవో అబ్దుల్ రహీమ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగేంద్ర ప్రసాద్

సదర(న్)లేక వదిలేశారు..!

పాలకొల్లు, న్యూస్‌టుడే: అసలే దివ్యాంగులు వారు కూర్చోవడానికి కూడా వసతులు లేని ప్రాంతమేదైనా ఉందంటే అది పాలకొల్లు సామాజిక ఆరోగ్య కేంద్రమే. బుధవారం ఇక్కడ దివ్యాంగులకు సదరన్ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడానికి వైద్యులు వస్తారు. వారి కోసం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి దివ్యాంగులు వారి వెంట బంధువులు పదుల సంఖ్యలో వస్తారు. పరీక్షా కేంద్రం బయట దివ్యాంగులు వేచి ఉండటానికి ఒక్కటంటే ఒక్క బల్ల వేశారు. దీంతో ఎక్కడబడితే అక్కడ ఆ మూలన ఒకరు ఈ మూలన ఒకరన్నట్టుగా దివ్యాంగులు కూర్చున్నారు. వారి సీటు వచ్చేవరకు వెంట వచ్చినవారితో పాటు కొందరు నిల్చుని నానా పాట్లు పడ్డారు. స్థానిక సీహెచ్‌సీలో సమస్యలకు అద్దంపట్టే చిత్రమిది.



తప్పించలేని గుంతలు

యలమంచిలి, న్యూస్‌టుడే: పాలకొల్లు - దొడ్డిపట్ల ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. ఇటీవల కురిసిన అధిక వర్షాలకు రోడ్డు పొడవునా భారీ గుంతలు ఏర్పడటంతో ద్విచక్ర వాహనం వెళ్లడానికి సైతం ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మేడపాడు - అడవిపాలెం మధ్యలో ఏర్పడిన గుంతల్లో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటుండటం ఆందోళనకు దారితీస్తుంది. ఆయా ప్రాంతాల్లో కనీసం కంకరతో గుంతలు పూడ్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.



పని చిన్నదే.. పట్టించుకోరే..

అయిదేళ్ల కిందటి నిర్మాణం అదీ.. కేవలం చిన్నపాటి పనులు చేస్తే ప్రజలకు ఎంతో ఉపయోగపడుతోంది... కాని వైకాపా కనీసం పట్టించుకోలేదు. వివరాల్లోకి వెళితే ఎన్ఆర్‌జీఎస్ నిధులు రూ.10 లక్షలతో నెగ్గిపూడి పంచాయతీ పరిధిలో చించినాడ కాలువపై కాలిబాట వంతెన నిర్మాణం చేశారు. నిధులు సరిపోని పరిస్థితుల్లో రక్షణ గోడ నిర్మించలేదు. ఈ లోపు వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో దీనిని పూర్తిగా విస్మరించారు. దీనిని అసంపూర్తిగా వదిలేయడంతో రాకపోకల సందర్భంలో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. వంతెనపై ఏమాత్రం ఆదమరచినా కాలువలో పడే అవకాశం ఉండటంతో అంతా భయపడుతున్నారు. పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. **- పెనుమంట్ర, న్యూస్‌టుడే**



అవి ఇవి అన్నీ

కార్మికులకు పని కల్పించాలి.. పోడూరు, న్యూస్‌టుడే: ఇసుక ర్యాంపులు తెరిపించి భవన నిర్మాణ కార్మికులకు పని కల్పించే విధంగా ప్రభుత్వం తక్షణం చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు కోరారు. సీపీఎం పోడూరు శాఖ మహాసభ స్థానిక కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇసుక దొరక్క నిర్మాణ రంగ కార్మికులకు పనులు దొరక్క ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అనంతరం శాఖ కార్యదర్శిగా కాకర వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు.

విధుల్లో చేరిన ఏఈ .. నరసాపురం, న్యూస్‌టుడే: నరసాపురం పురపాలక ఏఈగా శ్రావ్య బుధవారం విధుల్లో చేరారు. ఇక్కడి నుంచి భీమవరం బదిలీపై వెళ్లిన ఏఈ మణి స్థానంలో శ్రావ్య అక్కడి నుంచి నరసాపురం వచ్చారు. ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిన పట్టణ ప్రణాళికా విభాగ అధికారి, డీఈ, ఏఈ, ఆర్వో తదితరులు ఇక్కడకు రావాల్సి ఉంది.

నాలుగు రోజులు గ్రామ సభలు.. ఆచంట, న్యూస్‌టుడే: ఆచంట మండలంలోని రీసర్వే పూర్తయిన నాలుగు గ్రామాల్లో సభలు నిర్వహిస్తున్నట్లు ఆచంట ఇన్‌ఛార్జి తహసీల్దార్ ఎం.సోమేశ్వరరావు బుధవారం తెలిపారు. ఈ నెల 18 పెనుమంచిలి, 22 కరుగోరుమిల్లి, 24 కందరవల్లి, 26 కొడమంచిలిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ రైతుల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు వివరించారు.

మద్యం ప్రియుల పడిగాపులు.. మార్టేరు, న్యూస్‌టుడే: నూతనంగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాల వద్ద సరకు లేక మద్యం ప్రియులు బుధవారం పడిగాపులు పడ్డారు. మండలంలోని ఆరు దుకాణాల వద్ద ఇదే పరిస్థితి కనిపించింది. సాయంత్రం సమయంలో దుకాణాలు తెరిచినా సకాలంలో సరకు రాకపోవడంతో మద్యం బాబులకు సమాధానం చెప్పలేక సిబ్బంది ఇబ్బందిపడ్డారు. ఈ పరిస్థితుల్లో ఆయా ప్రాంతాల్లో తీర్థ వాతావరణం తలపించింది. రాత్రికి కొంత సరకు రావడంతో హడావిడిగా అమ్మకాలు ప్రారంభించారు.

పరిష్కారంలో జాప్యం వద్దు..

నరసాపురం, న్యూస్‌టుడే: ప్రతి సోమవారం నిర్వహించే 'ప్రజా వినతుల పరిష్కార వేదిక'లో ప్రజల నుంచి వచ్చే వినతుల పరిష్కారంలో జాప్యం లేకుండా ఉండేందుకు సమన్వయంతో పనిచేయాలని తహసీల్దారు రాజకిశోర్, ఎంపీడీవో త్రిశూలపాణి సూచించారు. మండల రెవెన్యూ కార్యాలయంలో బుధవారం పలుశాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.

భారీ వర్షం.. రహదారులు జలమయం

ఆచంట, పెనుగొండ, మార్టేరు, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఆచంట నియోజకవర్గంలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఆచంట కచేరీ సెంటర్‌తోపాటు కొన్ని ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. స్థానిక రామేశ్వరస్వామి ఆలయం ఎదుట రోడ్లు, ఆచంట-పాలకొల్లు మార్గం, స్థానిక నటరాజ్ థియేటర్ రోడ్డులో వర్షపు నీరు నిలిచిపోయింది. వల్లూరు, కొడమంచిలి, వేమవరం, పెనుమంచిలి తదితర గ్రామాల్లో గోతులు రహదారులపై వర్షం నీళ్లు నిలిచిపోయి స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

● పెనుగొండలో వారపుసంతకు వచ్చిన గ్రామస్థులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. కళాశాల కూడలి, నగరేశ్వర, మహిషాసురమర్దని, వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయ ఆవరణలో రహదారిపై నీరు నిల్చిపోవడంతో భక్తులు, విద్యార్థులు రాకపోకలకు అవస్థలు పడ్డారు. పెనుమంట్ర మండలంలో ఉదయం సమయంలో చిరుజల్లులు పడగా సాయంత్రం ఈదురుగాలులు, పిడుగులతో కూడిన భారీ వర్షం పడింది. పొలమూరు శివారులో ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతల్లోకి నీరు చేరి రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. గోస్తనీ ప్రభావంతో నత్తారామేశ్వరం రామేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలోకి నీరు చేరుతోంది.

నరసాపురం, గ్రామీణ, మొగల్తూరు, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణంలోని ప్రధాన రహదారిపై నీరు నిలిచి కొంత సమయం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పలు పల్లపు ప్రాంతాల్లో నీరు నిలిచింది. ముత్యాలపల్లి ఇందిరమ్మ కాలనీలో రహదారులపై నీరు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గొంది, చిట్టవరం, సరిపల్లి, మల్లవరం పెదలంక, మల్లవరం, సీతారాంపురం నార్త్, రుస్తుంబాద, యర్రంశెట్టిపాలెం, లక్ష్మణేశ్వరం, చామకూరిపాలెం తదితర గ్రామాల్లోని పొలాలు ముంపులో ఉన్నాయి.


నరసాపురం ప్రధాన రహదారిపై నిలిచిన వాహనాలు


లిఖితపూడిలో ముంపులో వరి చేను

బాలిక మృతి కేసులో నిందితుడి అరెస్టు

మొగల్తూరు, న్యూస్‌టుడే: అదృశ్యమైన బాలిక అనుమానాస్పదంగా మృతిచెందిన ఘటనపై నమోదైన కేసులో రెండో నిందితుడిని బుధవారం నరసాపురం గ్రామీణ సీఐ దుర్గాప్రసాద్ అరెస్టు చేశారని ఎస్సై జి.వాసు తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని ఒక గ్రామానికి చెందిన బాలిక ఇటీవల అదృశ్యమైంది. ఆ బాలిక, ఆ బాలికను అపహరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న యువకుడు హైదరాబాదులో విషగుళికలు తిని ఆత్మహత్యాయత్నం చేశారు. ఆమె ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ ఘటనకు సంబంధించి బాలిక కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదు చేసిన కేసులో రెండో నిందితుడు గుడాల నాగవెంకట ప్రసాద్‌ను అరెస్టు చేశామన్నారు. ఇంకా ఇద్దరు నిందితులను అరెస్టు చేయాల్సి ఉందని ఎస్సై తెలిపారు.

తల్లిని కొట్టిన వ్యక్తిపై కేసు

నరసాపురం, న్యూస్‌టుడే: మద్యం మత్తులో తల్లిని కొట్టిగాయపరిచిన వ్యక్తిపై బుధవారం కేసు నమోదు చేశామని పట్టణ ఎస్సై సీహెచ్ జయలక్ష్మి తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. టేలరు ఉన్నత పాఠశాల గ్రౌండువీధికి చెందిన దేవరపు సులోచనారాణి రెండో కుమారుడు శ్రీకాంత్ మద్యానికి బానిసయ్యాడు. ఈ నేపథ్యంలో తరచూ తల్లిని కొడుతున్నాడు. ఈ నెల 14న రాత్రి శ్రీకాంత్ తన తల్లిని కొట్టి గాయపరిచాడు. ఆమె చికిత్స నిమిత్తం ఏరియా ఆసుపత్రిలో చేరారు. అక్కడి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని జయలక్ష్మి తెలిపారు.

వివాదం వద్దన్నందుకు దాడి

నరసాపురం, న్యూస్‌టుడే: ఇరువర్గాలు ఘర్షణ పడుతుండగా వివాదం వద్దన్నందుకు ఒక వ్యక్తిపై దాడికి పాల్పడిన నిందితుడిపై బుధవారం కేసు నమోదు చేశామని పట్టణ ఎస్సై ఎస్ఎన్ ముత్యాలరావు తెలిపారు. లక్ష్మణేశ్వరం పంచాయతీ ముస్కేపాలేనికి చెందిన కర్రి బాలాజీ ఈ నెల 15న తన స్నేహితులతో కలిసి పట్టణంలోని స్వప్నబార్‌కు వెళ్లాడు. ఆ సమయంలో బార్ వెలుపల రెండు వర్గాలు ఘర్షణ పడుతుండటాన్ని గమనించిన బాలాజీ అక్కడకు వెళ్లి వివాదం ఎందుకని సర్దిచెప్పే ప్రయత్నం చేశాడు. ఆ సమయంలో సరిపల్లికి చెందిన రవి అనే వ్యక్తి బీరు సీసాతో బాలాజీ తలపై కొట్టి గాయపరిచాడు. దీనిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ముత్యాలరావు తెలిపారు.

వనరులున్నా నిధులు విదల్చలేదు..

ఆచంట, న్యూస్‌టుడే: 'ఆచంట' మండలంలోని 12 గ్రామాలతో పాటు పోడూరు, పెనుగొండ మండలాల్లోని శివారు గ్రామాలకు కూడలి ప్రాంతం. ఆచంట కచేరీ సెంటర్‌లో మూడేళ్ల కిందట బస్ షెల్టర్ కూల్చివేశారు. తిరిగి దానిని నిర్మించడానికి వైకాపా ప్రభుత్వం నిధులు విదల్చలేదు. నియోజకవర్గ కేంద్రంలో ప్రయాణికులకు నిలువ నీడ లేకుండా పోయింది. ఆచంటలో బస్సు స్టేషన్ నిర్మించడానికి అనువైన విశాలమైన స్థలాలు ఉన్నా అయిదేళ్ల పాటు వనరులు వినియోగించుకోలేదు. ఆచంట వస్తున్న ఆర్టీసీ బస్సులు కచేరీ సెంటర్‌లో 5 నిమిషాలు కూడా ఆపకుండా వెళ్లిపోవాల్సి వస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం వస్తే సెంటర్‌లో దుకాణాల దగ్గర తలదాచుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు.


మూడేళ్ల కిందట ఆచంటలో బస్సు షెల్టర్ తొలగించిన ప్రాంతం


నిర్మాణానికి సిద్ధంగా ఉన్న స్థలం

ఎగుడు.. దిగుడు..!

ప్రయాణానికి ఎంతో అనువైన ఆ కాల్వ గట్టు దారి ప్రమాదకరంగా మారింది. బ్రాహ్మణచెర్వు - వెలగలవారిపాలెం వెళ్లే రహదారి పరిస్థితి రోజు రోజుకీ అధ్వానంగా మారుతోంది. స్థానిక జీఅండ్‌వీ కెనాల్ నుంచి పంట పొలాలకు నీరందించే కల్వర్టు వద్ద రహదారి గుంతగా మారింది. దీంతో కార్లు వంటి చిన్న వాహనాలు వెళ్లిన సందర్భంలో కింద భాగం తగిలి వాహనాలు పాడవుతున్నాయి. కల్వర్టు ఇరువైపులా రక్షణ గోడలతో పాటు అంచులు సైతం పాడవటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. జుత్తిగ వంతెన వరకు రహదారికి గుంతలు పడ్డాయి. ఈ పరిస్థితుల్లో ఇటు వైపు ప్రయాణమంటే అంతా భయపడుతున్నారు. ఆర్అండ్‌బీ ఏఈ యశ్వంత్ మాట్లాడుతూ పరిశీలించి మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. **- పెనుమంట్ర, న్యూస్‌టుడే**



పోటెత్తిన కడలి

మొగల్తూరు, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో బుధవారం కడలి పోటెత్తింది. సాధారణంగా అమావాస్య తర్వాత, పౌర్ణమికి ముందు సముద్ర పోటు ఎక్కువగా ఉంటుంది. దీనికి తోడు అల్పపీడన ప్రభావంతో సముద్రఅలలు ఉద్ధృతంగా మారాయి. పేరుపాలెం సౌత్, కేపీపాలెంసౌత్‌లలో సముద్ర అలలు సుమారు 50 మీటర్ల వరకూ భూభాగంపైకి పోటెత్తాయి. సముద్ర పోటు ప్రభావంతో ఉప్పుటేరులు, మురుగు కాలువలు కూడా ఉద్ధృతంగా మారాయి. మొగల్తూరు, నరసాపురం మండలాల్లోని తీర గ్రామాల్లో ఆక్వాచెరువులు ముంపుబారిన పడ్డాయని రైతులు తెలిపారు.

తాడేపల్లిగూడెం

•తాడేపల్లిగూడెం •తణుకు

ఆహారం ఔషధంలా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న వర్మ

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆహారం ఔషధంలా ఉండాలని సామాజికవేత్త టీవీవీఎస్ వర్మ అన్నారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం అధ్యక్షుడు కరుణాకర్ చౌదరి అధ్యక్షతన స్థానిక బ్యాంక్ కాలనీ కార్యాలయం వద్ద ప్రపంచ ఆహార దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కోశాధికారి భాస్కరరావు, మనోరమ, ఆంజనేయులు, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

18న రాష్ట్ర సదస్సు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: ఈ నెల 18న విజయవాడలో నిర్వహించే ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని జిల్లా సహాయ కార్యదర్శి మాదిరి దాన వర ప్రసాద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రాలను బుధవారం స్థానిక శేషమహల్ కూడలిలో ఆవిష్కరించారు.



గోడ పత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

నేటి నుంచి నట్టల నివారణ కార్యక్రమం

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం మండలం పట్టింపాలెంలో గురువారం గొర్రెలు, మేకల నట్టల నివారణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల పశువైద్యాధికారి వీవీ విజయకుమార్ తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు వాసవీమాత రథోత్సవం

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి వెండి రథోత్సవం గురువారం నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు మారం వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 250 మంది కళాకారులతో అమ్మవారి ఊరేగింపు స్థానిక రేలంగి చిత్ర మందిర్ నుంచి ప్రారంభిస్తామన్నారు.

మెప్మా విస్తృత స్థాయి సమావేశం

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం మెప్మా పట్టణ సమాఖ్య విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షురాలిగా జి.పద్మప్రియ, కార్యదర్శిగా టి.మధుమతి, కోశాధికారిగా కరణకుమారి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీఎంఎం బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

కైకరం(ఉంగుటూరు), న్యూస్‌టుడే: జిల్లా స్థాయి యోగా పోటీల్లో కైకరం ఉన్నత పాఠశాల విద్యార్థులు పాదిరెడ్డి నాగరాజు, ఉప్పాడ రేవంత్ వసంత్ కుమార్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుళ్ల ప్రసాదరావు, పీఈటీ పాపయ్య, నాగరాజు, ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు. నవంబరులో నెల్లూరు వేదికగా జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని వారు తెలిపారు.



ప్రశంసాపత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

సేంద్రియ సాగు.. ఆరోగ్యం బాగు

సిరులు పండిస్తున్న అతివలు

ప్రతిపాడు (పెంటపాడు), న్యూస్‌టుడే: వరిసాగులో విచ్చలవిడిగా రసాయనాలు వినియోగిస్తుండటంతో ప్రజారోగ్యం దెబ్బతింటోంది. ఈ నేపథ్యంలో ప్రకృతి వ్యవసాయ విభాగం రైతులకు సేంద్రియ విధానంపై అవగాహన కల్పించి ప్రోత్సహిస్తోంది. దీనిలోభాగంగా తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో పెంటపాడు మండలంలోని అలంపురం, మీనవల్లూరు, పడమరవిప్పర్రు, తాడేపల్లిగూడెం మండలంలోని వెంకట్రామన్నగూడెం, పెదతాడేపల్లి, చినతాడేపల్లి, జగన్నాథపురం గ్రామాల్లో సుమారు 490 మంది రైతులు 350 ఎకరాల్లో సేంద్రియ సాగు చేస్తున్నారు. వారిలో పెంటపాడు మండలానికి చెందిన పలువురు మహిళా రైతులు పురుషులకు దీటుగా సాగు చేస్తూ సిరులు పండిస్తున్నారు. వారిని 'న్యూస్‌టుడే' పలకరించగా తమ మనోభావాలను ఇలా వ్యక్తం చేస్తున్నారు.



దిగుబడి బాగుంది

ప్రకృతి వ్యవసాయ పద్ధతిని అవలంబించడంతో వరిసాగులో పంట తెగులు, పురుగు నివారణ జరిగి ఎకరానికి 38 బస్తాల వరకు దిగుబడి వచ్చింది. గత మూడు పంటల నుంచి ఇదే విధానాన్ని పాటిస్తున్నా. తక్కువ పెట్టుబడి పెడుతున్నా. రసాయనాలు వాడకుండా పంట పండించడంతో ఆరోగ్యంగా ఉండటానికి అవకాశం ఉంది. **- మామిడిశెట్టి అంజలి**



తక్కువ పెట్టుబడితో..

మొదట సంవత్సరం ఎకరం విస్తీర్ణంలో సేంద్రియ సాగుచేయడం ప్రారంభించా. దిగుబడులు బాగుండటంతో ప్రస్తుతం రెండెకరాల్లో సాగు చేస్తున్నా. ఎరువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్న తక్కువ పెట్టుబడితో సిరులు పండిస్తున్నా. ఘన, ద్రవ జీవామృతం, ఇతర కషాయాలను వినియోగిస్తున్నా. కష్టానికి తగ్గట్లుగా ఎకరానికి 35 నుంచి 38 బస్తాల వరకు దిగుబడి సాధిస్తున్నా. **- గోపిశెట్టి నీలిమ**

నాలుగెకరాల్లో..

వ్యవసాయంపై మక్కువతో నేను నాలుగేళ్లుగా 4 ఎకరాల్లో సాగు చేస్తున్నా. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సూచనలతో పాటు యాజమాన్య పద్ధతులు, సాంకేతికత జోడిస్తే మంచి ఫలితాలు ఉంటాయి. ఆరోగ్యవంతమైన ఆహారాన్ని కుటుంబంతో కలిసి తినగలుగుతున్నా. పలువురు రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నా. **- మజ్జి గౌరి, మహిళారైతు, అలంపురం**



జీవామృతం తయారు చేస్తున్న సిబ్బంది



అవగాహన కల్పిస్తున్నాం

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్నాం. దేశీయ ఆవు నుంచి లభించే గోమూత్రం, పేడతో జీవామృతాలు తయారుచేసే పద్ధతులను నేర్పుతున్నాం. మార్కెట్‌లో ప్రకృతి సాగులో వచ్చే దిగుబడులకు మంచి ధరతో పాటు డిమాండ్ ఉంది. **- గుమ్మళ్ల వీర్రాజు, ప్రకృతి వ్యవసాయ విభాగం, పెంటపాడు మండల ఇన్‌ఛార్జి**



మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తాడేపల్లిగూడెం	: 79950 67078
పెంటపాడు	: 79939 36123
తణుకు గ్రామీణ	: 85558 50851
అత్తిలి	: 91548 46774

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే

సమస్య: తాడేపల్లిగూడెం పట్టణం ఆర్టీసీ బస్టాండు వెనుక కేఎన్ రోడ్డులో మురుగు బోదె నిండుకుని భరించలేని దుర్వాసన వస్తోంది **- శివ, స్థానికుడు**

సమాధానం: మురుగు బోదెలోని మురుగు సాఫీగా ముందుకు సాగేలా చర్యలు చేపడతాం **- శ్రీమన్నారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

సమస్య: తాడేపల్లిగూడెం పట్టణం వెంకట్రామా సినిమా హాలు నుంచి సీతారాంపేటకు వెళ్లే రోడ్డులో చెత్త పేరుకుని రహదారిలోకి వస్తోంది **- రామారావు, స్థానికుడు**

సమాధానం: పరిశీలించి చెత్తను తొలగించేలా చర్యలు చేపడతాం **- సోమేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

తాడేపల్లిగూడెం టూటౌన్, న్యూస్‌టుడే

సమస్య: తాడేపల్లిగూడెం పట్టణంలోని వీకర్స్ కాలనీ, భాగ్యలక్ష్మిపేట ప్రాంతాల్లో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. భరించలేని దుర్వాసన వస్తోంది. **- రామకృష్ణ, స్థానికుడు**

సమాధానం: పందులను పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటాం. **- ఏసుబాబు, పురపాలక సంఘ కమిషనర్**

సమస్య: తాడేపల్లిగూడెం పట్టణం జువ్వలపాలెం నుంచి పెంటపాడు మండలం రాచర్ల వెళ్లే మార్గం పెద్దపెద్ద గోతులు పడి అధ్వానంగా మారింది. రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. **- శ్రీనివాస్, స్థానికుడు**

సమాధానం: రహదారికి మరమ్మతులు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటాం. **- రవిబాబు, ఏఈ, ర.భ.శా.**



ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు స్వాగతం పలుకుతున్న స్థానికులు, అధికారులు

పల్లె పండగతో గ్రామాల అభివృద్ధి

ఇటుకులగుంట (తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: పల్లె పండగతో గ్రామాలు అభివృద్ధి బాట పట్టనున్నాయని తాడేపల్లిగూడెం శాసన సభ్యుడు బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం మండలం ఇటుకులగుంటలో ఉపాధి పథకం నిధులు రూ. 40 లక్షలతో గ్రామం నుంచి ఆరుగొలను వరకు రోడ్డు నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్‌డీఏ ప్రభుత్వం రహదారుల అభివృద్ధిపై దృష్టి సారించిందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రధాన మంత్రి మోదీ సహకారంతో కేంద్రం నుంచి పెద్ద ఎత్తున నిధులు తీసుకు వచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో పరుగులు పెట్టిస్తున్నారన్నారు. దమ్ము చక్రాలు, వరికోత యంత్రాలతో రోడ్లు పాడవకుండా చూసుకోవాల్సి బాధ్యత ప్రజలదేనని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో మల్లాది విశ్వనాథ్, ఈవోపీఆర్‌డీ ముప్పిడి వెంకటేష్, సర్పంచి మర్లపాటి వీర వెంకట సుబ్బలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బీ రాజా శ్రీనివాస్, జనసేన నాయకులు వర్తనపల్లి కాశీ, కాళ్ల గోపీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సత్వర పరిష్కారానికి గ్రామదర్శిని

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో సమస్యల సత్వర పరిష్కారానికి గ్రామదర్శిని కార్యక్రమం చేపట్టామని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. ఈ మేరకు బుధవారం మండలంలోని కొమరవరంలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించేందుకు అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎన్డీయే నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కొమరవరంలో సమస్యలు తెలుసుకుంటున్న ఆరిమిల్లి

అధికారుల కృషితో సమస్యలకు చెల్లు

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: అత్తిలి మండలంలో ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని తహసీల్దార్ దశిక వంశీ అన్నారు. బుధవారం అత్తిలి తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారులు, వివిధ పార్టీల నాయకులతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార సమావేశం ఏర్పాటు చేశారు.

రేపట్నుంచి రీసర్వే గ్రామసభలు

ఉంగుటూరు: రీసర్వే పూర్తైన గ్రామాల్లో శుక్రవారం నుంచి సభలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి తహసీల్దారు పూర్ణచంద్రప్రసాద్ తెలిపారు. భూ విస్తీర్ణంలో తేడాలు, ఉమ్మడి భూముల విభజన, వారసత్వం పేర్ల నమోదు, సమస్యలు, రైతు దస్త్రాల్లో మార్పులపై గ్రామసభ ఏర్పాటు చేశామన్నారు. 18న వెల్లమిల్లి, 19న బొమ్మిడి, 22న కాగుపాడు, 23న రావులపర్రు, 24న రాచూరు, 25న దొంతవరంలో సభలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

ఆర్గానిక్ కోర్సుకు తక్షణ ప్రవేశాలు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: తణుకు ఎస్కేఎస్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని పీజీ ఆర్గానిక్ కోర్సులో చేరే విద్యార్థుల కోసం అడ్మిషన్లు జరుగుతున్నాయని ప్రిన్సిపల్ డా.పి.అనిల్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 ఏపీపీజీసీఈటీలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో అక్టోబర్ 17 నుంచి 21 తేదీ లోపు కళాశాలలో నిర్వహించే స్పాట్ అడ్మిషన్లకు హాజరుకావాలని తెలిపారు. స్పాట్ అడ్మిషన్ ఆధారంగా చేరిన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదని, ఫీజు అక్టోబర్ 22 నుంచి 24 లోపు చెల్లించాలని తెలిపారు.

పురుగు మందుల వినియోగం తగ్గించాలి

పెంటపాడు, న్యూస్‌టుడే: పురుగుమందుల వినియోగం తగ్గిస్తేనే వరిలో మేలైన దిగుబడులు సాధించడం సాధ్యపడుతుందని జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు అన్నారు. పెంటపాడు మండలం రాచర్లలోని వ్యవసాయ క్షేత్రాల్లో ఏడీఏ మురళీకృష్ణ అధ్యక్షతన శనివారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వర్షాలు పడుతున్న నేపథ్యంలో వరిచేలల్లో నీరు నిలవకుండా చూసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోళ్లల్లో రైతులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం పటిష్ఠ ఏర్పాట్లు చేసిందన్నారు. త్వరలో రైతులకు రాయితీపై యంత్రాలు, టార్పాలిన్లు తదితరాలను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఏవో పార్థసారథి, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలు చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు

చట్టప్రకారం అమలు చేయాలి



నినాదాలు చేస్తున్న నాయకులు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: గ్యాస్ కార్మికులకు చట్టప్రకారం వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక అమరవీరుల భవనం వద్ద కామ్రేడ్ ఈశ్వరరావు అధ్యక్షతన మహాసభ నిర్వహించారు. ముందుగా ఏచూరి, కామ్రేడ్ రుద్రరాజు సత్యనారాయణ రాజు, ఇతర అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ గ్యాస్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. కార్మిక శాఖా అధికారులు ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న వారి పరిస్థితులపై నిరంతరం పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు రంగారావు, పీడీ మూర్తి, ముత్యాలరావు, పద్మరావు తదితరులు పాల్గొన్నారు.

'మానవత' ఆర్థిక సాయం

పెంటపాడు, న్యూస్‌టుడే: బ్రెయిన్ స్ట్రోక్‌తో కొద్ది రోజులుగా ఇబ్బందులు పడుతున్న పెంటపాడు కూనాకరపేటకు చెందిన ఉండ్రాజవరపు గోపిని బుధవారం మానవత పెంటపాడు శాఖ బృందం పరామర్శించింది. ఈ సందర్భంగా సంస్థ ఆధ్వర్యంలో రూ.11 వేలను వైద్యఖర్చుల నిమిత్తం గోపీకి అందజేశారు. కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా విద్యాకమిటీ ఛైర్మన్ తాడేపల్లి మోహనరావు, తారాడి పాల్, వీరాస్వామి, వినాయకుడు, నక్కా సాంబశివ, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ గ్రామోత్సవం



విశేషాలంకరణలో అమ్మవారు

భీమడోలు, న్యూస్‌టుడే: నరెడ్లగూడెంలో దేవీ శరన్నవరాత్రుల ముగింపు సందర్భంగా బుధవారం కనకదుర్గమ్మను గ్రామ వీధుల్లో ఊరేగించారు. తొలుత అమ్మవారి గద్దె వద్ద నుంచి అష్టలక్ష్ములతో రూపొందించిన ప్రత్యేక వాహనంపై ఉత్సవమూర్తిని కొలువుదీర్చారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాల మధ్య భీమడోలులో ఊరేగించారు.

కార్పొరేషన్ స్థాయికి అభివృద్ధి ప్రణాళిక

'న్యూస్‌టుడే'తో మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు



తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీ అయిన తాడేపల్లిగూడెం పురపాలక సంఘాన్ని పక్కా ప్రణాళికతో కార్పొరేషన్ స్థాయికి అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు పేర్కొన్నారు. ఇటీవల కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన వార్డుల్లో క్షేత్రస్థాయి పర్యటన చేస్తూ తాగునీరు, వీధి దీపాలు, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. అధికారులను సమన్వయం చేసుకుంటూ పౌర సేవలు ప్రజలకు సక్రమంగా అందేలా కృషి చేస్తున్నారు. ఈ మేరకు పలు అంశాలపై ఆయన 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు.

ఆదాయ వనరులపై దృష్టి

మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలంటే ఆదాయం తప్పనిసరి. చాలా మంది వ్యాపారులు ట్రేడ్ లైసెన్సులు తీసుకోవడం లేదు. పట్టణ పరిధిలో సుమారు ఏడు వేలకు పైగా వాణిజ్య సముదాయాలు ఉన్నాయి. వాటి ద్వారా కేవలం రూ.1.60 లక్షలు మాత్రమే ఆదాయం వస్తోంది. ప్రకటనల పన్నులు సైతం వసూలు చేయడం లేదు. అలాగే ఖాళీ స్థలాలు, ఇల్లు, తాగునీరు తదితర పన్నులు సక్రమంగా వసూలు కావడం లేదు. సుమారు రూ.15 కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయి. ఇలాంటి పరిస్థితుల్లో మార్పు తీసుకొచ్చేందుకు కృషి చేస్తాం.

డ్రెయినేజీలను ఆధునికీకరించాలి

పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ ఆశించిన స్థాయిలో లేదు. ప్రధానంగా డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. త్వరలో సుమారు 18 కిలోమీటర్ల మేర నూతన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నాం. ఒకటో పట్టణానికి సంబంధించిన మురుగు ఏలూరు కాలువలో కలవకుండా పట్టణంలోని మూడు ప్రాంతాల్లో ఎస్టీపీ ప్లాంట్ల నిర్మాణానికి కసరత్తు జరుగుతోంది. కడకట్ల శివారులో నిర్మిస్తున్న ఎస్టీపీని త్వరలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం.

సురక్షిత నీరు సరఫరా చేస్తాం

ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఇవ్వాలని ప్రభుత్వ లక్ష్యం. పట్టణంలో ఇప్పటికే 20 వేల కనెక్షన్లు ఇచ్చాం. మరో 6 వేలు ఇవ్వాల్సి ఉంది. ప్రజలకు సురక్షిత నీటిని సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టాం. పైపులైను లీకులకు వెంటనే మరమ్మతులు నిర్వహించేందుకు ప్రత్యేకంగా సిబ్బంది ఏర్పాటు చేశాం.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

ఇంటి ప్లాన్ తీసుకుని ఆ మేరకు నిర్మాణాలు చేపట్టకపోతే సహించేది లేదు. అక్రమ కట్టడాలు, ఆక్రమణలను గుర్తిస్తాం. నిబంధనలు పాటించని వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడంతోపాటు కేసులు సైతం నమోదు చేస్తాం.

అభివృద్ధి పనులకు భూమిపూజ

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: అత్తిలి మండలం స్కిన్నెరపురంలో బుధవారం అంతర్గత డ్రెయిన్లు, సీసీ రహదారుల నిర్మాణానికి భూమిపూజలు నిర్వహించినట్లు గ్రామ తెదేపా నాయకుడు చెన్నం కృష్ణమూర్తి చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకటన

తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

Creditor in IP 24/2024

మధ్య:

గొర్రెల వెంకటరావు, S/o సన్యాసిరావు, వయస్సు 50 సం॥, ఛానమిల్లి, శ్రీరాంపురం, బావాయిపాలెం, నిడమర్రు మండలం - పిటీషనరు

Vs

1. పాలచర్ల అనంతలక్ష్మి స్వరూపరాణి, W/o సుబ్రమణ్యం, వయస్సు 70 సం॥ ఉంగుటూరు మండలం, ప్రస్తుతం ఏలూరు జిల్లా
2. యెరుబండి వీర్రాజు, S/o నాగేశ్వరరావు, వయస్సు 38 సం॥ ఫ్లాట్ నెం. 104, ఫస్ట్ ఫ్లోర్, వెంకటాద్రి టవర్స్, భీమవరం
3. అఫీషియల్ రిసీవర్, పశ్చిమగోదావరి, ఏలూరు

పై నెంబరు IP లో పిటీషనరు షెడ్యూలు ఆస్తిపై పిటీషను వేసినారు. అందు 1వ రెస్పాండెంటు, 2వ రెస్పాండెంటుకు లాలూచీగా వ్రాసిన దస్తావేజు నెం. 11076/2023 ది. 23-08-2023, SRO, తాడేపల్లిగూడెం చెల్లదని మరియు సదరు ఆస్తిపై పిటీషనరుకు రావల్సిన బాకీ రాబట్టగలరని సదరు ఆస్తికి అఫీషియల్ రిసీవరు ఏలూరు వారు అడ్మినిస్ట్రేషన్ చేయుదురు అని పై నంబరు పిటీషను దాఖలు చేసినారని యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూలు: ఏలూరు (పశ్చిమగోదావరి) జిల్లా, ఉంగుటూరు మండలం, తాడేపల్లిగూడెం సబ్.డి.లో చేరిన ఉంగుటూరు గ్రామ పంచాయతీ తాలూకు రి.స.నెం. 1149/7 రులో డోర్ నెం. 6-20రు గల చ.గ. 50లు స్థలము అందలి గల ఆర్‌సిసి బిల్డింగునకు హద్దులు. **తూర్పు:** అ 15 లు రెడ్డి సూర్యారావు గారి కుమార్తె గారి ఇల్లు కొంత, పంచాయతీ రోడ్డు కొంత, **దక్షిణం:** అ 30 లు పంచాయతీ రోడ్డు, **పడమర:** అ 15 లు పంచాయతీ రోడ్డు, **ఉత్తరం:** అ 30 లు నారాయణ శ్రీను గారి ఇల్లు

ఈ హద్దుల మధ్య చ.గ. 50లు స్థలమున్నూ, అందలి ఆర్.సి.సి. బిల్డింగు, అసెస్‌మెంట్ నెం. 591, కరెంటు సర్వీస్ నెం. 2766రు ఆర్‌సిసి బిల్డింగునకు అమర్చిన కిటికీలు, తలుపులు, ద్వారబందాలు పైకప్పు వగైరాలుతో సహా సదరు స్థలమునకు అనాది నుండి గల మామూలు మార్గములు, రాకపోకల హక్కులు అందలి యావత్తు యీజుమెంటు హక్కులుతో సహా.

సం/- **శిరిగినీడి విజయకృష్ణ,** అడ్వకేటు
Ex. Addl. PP, తాడేపల్లిగూడెం, సెల్: 94401 11251

ఎండకు ఎండి.. వానకు తడిచి

షెడ్లు లేక విద్యార్థులకు అవస్థలు

పెంటపాడు న్యూస్‌టుడే : పలు సర్కారు బడుల్లో సైకిళ్లకు రక్షణ లేకుండాపోయింది. ఎండకు ఎండి.. వానకు తడిచి మరమ్మతులకు గురవుతుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పెంటపాడు మండలంలోని 10 ఉన్నత పాఠశాలలు ఉండగా వాటిలో సుమారు 3 వేలకు పైగా విద్యార్థులు ఉన్నారు. వారిలో సగానికిపైగా సైకిళ్లపైనే పాఠశాలలకు రాకపోకలు సాగిస్తారు. పెంటపాడులోని ఎస్టీవీఎన్ ఉన్నత, ముదునూరు, రావిపాడు, కస్పాపెంటపాడు, దర్శిపర్రు, పరిమెళ్ల, మీనవల్లూరు, పడమర విప్పర్రు పాఠశాలల్లో సైకిల్ షెడ్లు లేవు. గత్యంతరం లేక వారు ప్రహరీల పక్కన, మైదానాల్లో, చెట్ల నీడల్లో నిలుపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సైకిల్‌షెడ్లను నిర్మించాలని కోరుతున్నారు.



కస్పాపెంటపాడులో ఆరుబయట సైకిళ్లు

ఉన్నతాధికారులకు విన్నవిస్తాం

'ప్రభుత్వ పాఠశాలల్లో సైకిలు షెడ్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. దాతలు, పూర్వ విద్యార్థులు షెడ్ల నిర్మాణానికి ముందుకు రావాలి.' అని పెంటపాడు ఎంఈవో శ్రీనివాస్ తెలిపారు.

దారులు.. ప్రమాదకరంగా మారి..



అత్తిలి నుంచి పాలూరు దారి దుస్థితి

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: అత్తిలి నుంచి పాలూరు, కంచుమర్రు, కోమర్రు, బల్లిపాడు, కె.సముద్రపుగట్టు వెళ్లే ప్రధాన రహదారులు గోతులతో అధ్వానంగా తయారయ్యాయి. రాకపోకలు సాగించే ప్రయాణికులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురిసినపుడు గోతుల్లో నీరు చేరడంతో రాత్రి సమయాల్లో అవి కనిపించక వాహనచోదకులు ప్రమాదాలబారిన పడుతున్నారు. రహదారుల నిర్మాణానికి అంచనాలు రూపొందిస్తున్నామని, త్వరలోనే నిర్మాణాలు చేపడతామని రభశా డీఈ యశ్వంత్ తెలిపారు.

కాలుష్య చెరలో చెరువు



పెంటపాడు న్యూస్‌టుడే : చెరువులు ప్రధాన తాగునీటి వనరులు. వీటిని పరిశుభ్రంగా ఉంచడంలో గ్రామస్థాయి అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పలు గ్రామాల్లో కుళాయిల ద్వారా కలుషిత, రంగు మారిన నీరు సరఫరా అవుతోందని ప్రజలు చెబుతున్నారు. ఆర్థిక స్తోమత ఉన్నవారు శుద్ధి చేసిన నీటిని కొనుగోలు చేస్తున్నారు. పేదలకు మాత్రం కలుషిత నీరే దిక్కవుతోంది. దీంతో అనేక మంది రోగాల బారినపడి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. పెంటపాడులోని యూనియన్ బ్యాంకు వద్ద ఉన్న తాగునీటి చెరువు పసర్లుపట్టి, తూడుతో అలుముకుపోయింది. జట్లపాలెం, ఉమామహేశ్వరం, బి.కొండేపాడు, యానాలపల్లి, ముదునూరు, వల్లూరుపల్లి, రాచర్ల, కోరుమల్లి, చింతపల్లి, తదితర గ్రామాల్లోని తాగునీటి చెరువులు తామరతూడు, కర్రనాచుతో అలుముకుపోయాయి. చుట్టూ పిచ్చిమొక్కలు మొలవడంతో పాటు కొందరు వ్యక్తులు మద్యం తాగి, ఖాళీ సీసాలను చెరువులోనే పడేస్తున్నారు. "చెరువులను పరిశీలించి తూడు, కర్రనాచు తొలగించి శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటాం. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలిచ్చాం." అని ఎంపీడీవో బాలాజీ వెంకటరమణ అన్నారు.

సమస్యల వాకిట టిడ్కో గృహాలు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం పట్టణంలో టిడ్కో గృహాలకు సంబంధించి ఫేజ్-1లో భాగంగా 5376 ఇళ్లు మంజూరయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో ఎలాంటి మౌలిక సదుపాయాలు కల్పించకుండానే దశల వారీగా పలువురు లబ్ధిదారులకు పట్టాలు అందించారు. పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించకుండానే ఇళ్లు పంపిణీ చేయడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. కొన్ని బ్లాకుల్లో విద్యుత్తు, నీటి సరఫరా వంటి సదుపాయాలు లేవు. తలుపులు ధ్వంసం అయ్యాయి. గోడలు బీటలువారాయి. వీటికి మరమ్మతులు చేపట్టకుండానే ఇళ్లను పంపిణీ చేసేశారు. లబ్ధిదారులు అదనంగా రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టుకుని మరమ్మతులు చేసుకోవాల్సిన పరిస్థితి.

ఇది ఇలా ఉండగా లీకుల సమస్య లబ్ధిదారులను వేధిస్తోంది. వర్షం పడితే చాలు వర్షపు నీరు ఇళ్లలోకి చేరుతోంది. వారంలో రెండు మూడు రోజులు మాత్రమే చెత్త సేకరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 3100 మందికి ఇళ్లు అందించినా.. మౌలిక సదుపాయాలు లేకపోవడంతో కేవలం 1100 కుటుంబాలు మాత్రమే అక్కడ నివాసం ఉంటున్నాయి. దీనిపై మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.



అసంపూర్తిగా గృహ సముదాయాల నిర్మాణాలు



బీటలు వారిన గోడలు